RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 18 జూన్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:17

# విద్యా వికాసం కోసమే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"

**ప్రతీ నియోజకవర్గానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్**

**తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్**

**దేశానికి రోల్ మోడల్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపించడంలో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో



తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించి విద్యార్థులకు అంకితమిచ్చారు. తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు రంగుల గోడల్లో లేదని, తరగతి గదుల్లోనే ఉందని తాము సంపూర్ణంగా విశ్వసించామన్నారు. అందుకే విద్యాకమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం పాఠశాలలల్ని బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే స్ఫూర్తి కాదని, తెలంగాణలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

మిగతా 2లో

# ప్రధాని మోదీని పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో ప్రధాని మోదీపై ట్రంప్ ప్రశంసలు**

**మోదీ ప్రశాంతంగా, కూల్‌గా ఉంటారని వ్యాఖ్య**

**నిర్ణయాలు తీసుకోవడంలో మోదీ ఒక 'టోటల్ కిల్లర్' అని కొనియాడిన ట్రంప్**

**మోదీ-ట్రంప్ భేటీ కోసం ఎదురుచూస్తున్నామన్న అమెరికా రాయబారి**

ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ–7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ దేశాల నేతలు పాల్గొన్న 'వర్కింగ్ లంచ్' సందర్భంగా మోదీ వ్యక్తిత్వాన్ని, పనితీరును కొనియాడుతూ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీ ఎంతో ప్రశాంతంగా ఉంటారు. కానీ, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనొక 'టోటల్ కిల్లర్'. నేను ఆయనలా కాదు.. ఒకసారి ఆయన్ని చూడండి" అంటూ చమత్కరించారు. తన దూకుడు స్వభావానికి, మోదీ నిశ్చల వైఖరికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ట్రంప్ ఈ మాటలతో పోల్చి చెప్పారు.

మరోవైపు, ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరగనున్న భేటీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అమెరికా ప్రతినిధి సెర్గియో గోర్ తెలిపారు. "ప్రధాని మోదీని కలవడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. వారిద్దరి సమావేశం కోసం మేం ఎదురుచూస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. జీ–7 సదస్సు వేదికగా ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న సానుకూల వాతావరణానికి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు



**1.621 శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం,70,804 మంది ఉద్యోగులకు ప్రయోజనం**

**రికార్డు స్థాయి డిమాండ్ ఉన్నా నిరంతరాయ సరఫరా**

**2035 నాటికి రెట్టింపు కానున్న విద్యుత్ డిమాండ్**

**వర్షాకాలం వేళ విద్యుత్ సిబ్బంది అలర్ట్ గా ఉండాలి ,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

వార్తా 3 లో

# పేదలు సన్న బియ్యం తినాలి

**రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ సంకల్పం**

**లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు**

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీలో చెప్పారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. ఈ సందర్భంగా రైతులకు లాభదాయకమైన దీూ 5204, తెలంగాణ సోనా (=చీ= 15048), ఖచీవీ–1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.

మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది.

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమీషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ ఛైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

**రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో గుడిసెల వాసులకే తొలి ప్రాధాన్యత**


**యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి అర్హుల ఎంపిక**

**రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం**

**ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి**

**రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**







హైదరాబాద్: రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి గారు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే

రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హుల ఎంపికలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ఎటువంటి పొరపాట్లు, వివక్షకు తావు లేకుండా అనర్హుల చొరబాటుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

మిగతా 3 లో

ప్రజాబలం

18 జూన్ 2026 గురువారం

## మళ్లీ తెరపైకి డిలిమిటేషన్

జనాభా ఆధారిత డీలిమిటేషన్ ఫార్ములాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసి, దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు తమకు సీట్లను తగ్గించి శిక్షిస్తారా? అని చంద్రబాబు నాయుడు, స్టాలిన్ వంటి నేతలు ఇప్పటికే బహిరంగంగానే ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం 50 శాతం పెంపు ఫార్ములాను మొండిగా ముందుకు తీసుకెళ్తే దక్షిణాది పార్టీలు ఖచ్చితంగా వ్యతిరేకిస్తాయి. అయితే, ఒకవేళ ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రతిపాదించిన 'టార్గెటెడ్ అండ్ వెయిటెడ్' పద్ధతిని ప్రవేశపెట్టి.. జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తే మాత్రం దక్షిణాది పార్టీలు ఆ ఫార్ములాకు ఓటేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ, అది అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత కీలకం. ఉత్తరాదిలోని ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు కోటాలో కోటా ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు రెండింటికీ పార్లమెంటరీ ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి ప్రభుత్వం గతంలో చేసిన ప్రయత్నానికి పార్లమెంట్‌లో అవసరమైన మద్దతు లభించకపోవడంతో ఈ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది.అయితే, పార్లమెంట్‌లో ఎన్డీఏ బలం పెరుగుతున్న తరుణంలో, మహిళా ఓటర్ల మద్దతును పూర్తిగా స్వంతం చేసుకోవడానికి కేంద్రం ఈ రెండు బిల్లులను ఒకేసారి ముడిపెట్టి ఆమోదించే వ్యూహంతో ముందుకు వెళ్తోందిరాబోయే రోజుల్లో డీలిమిటేషన్ చర్చ కేవలం సీట్ల సంఖ్యకు పరిమితం కాకుండా.. భారతదేశ సమాఖ్య స్ఫూర్తి కి ఒక పెద్ద పరీక్షగా మారబోతోంది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో లభించిన 2/3 వంతు మెజార్టీతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందా, లేదా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సలహా మండలి సూచించిన సమతుల్య ఫార్ములా వైపు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంద దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై రాజకీయ సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. గతంలో ఎన్డీఏ కూటమికి పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ లేకపోవడం వల్ల ఈ రాజ్యాంగ సవరణల ప్రక్రియ సాధ్యం కాదనే చర్చ నడిచింది. అయితే, లోక్‌సభలో అనూహ్యంగా తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన సుమారు 20 మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం, ఇండీ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ కోసం సానుకూల సంకేతాలు ఇస్తుండటంతో మోదీ-షా ద్వయానికి అవసరమైన సంఖ్యాబలం సమకూరుతున్నట్లు స్పష్టమవుతోంది. అసలు డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన జరగబోతోంది? దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తు ఏంటి? ఈ ఫార్ములా ప్రకారం.. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను నేరుగా దాదాపు 50 శాతం పెంచుతారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని కూడా ఇదే సంఖ్యాబలానికి అనుగుణంగా నిర్మించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారిపోయాయి. తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్-డీఎంకే కూటమి విచ్ఛిన్నమైందన్న వార్తలు చర్చనీయాంశంగా ఉన్న కీలక పరిణామాల్లో ఒకటి. బిల్లుకు విస్తృత మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం డీఎంకేను సంప్రదించే ప్రయత్నాలను ప్రారంభించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నారు. ఒకవేళ గణనీయ సంఖ్యలో ఎంపీలు టీఎంసీ నుంచి విడిపోతే అది పార్లమెంటరీ సమీకరణాలను మార్చివేసి బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వానికి సులభతరం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.పోయినసారి డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు దాని ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమైంది. అంటే బిల్లుకు అనుకూలంగా కనీసం 362 ఓట్లు అవసరం. అయితే బిల్లుకు 298 మంది సభ్యుల మద్దతు మాత్రమే లభించింది. బిల్లుకు వ్యతిరేకంగా 230 మంది ఎంపీలు ఓటు వేశారు. ఫలితంగా బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం దక్కక సభలో వీగిపోయింది.జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి నష్టం వాటిల్లుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించింది. కేవలం జనాభాయే కాకుండా.. భౌగోళిక విస్తీర్ణం, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత వంటి వివిధ సూచీలను పరిగణనలోకి తీసుకుని 'టార్గెటెడ్ నియోజకవర్గాల విభజన' చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు మరీ ఘోరంగా నష్టపోకుండా ఒక సమతుల్యత సాధ్యమవుతుంది.

# విద్యా వికాసం కోసమే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి





ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని, ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెరిగేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణలో ప్రతీ శాసన సభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని, ఈ స్కూల్స్ ద్వారా వచ్చే ఫలితాలు, సమస్యలను అవగాహన చేసుకుని రాష్ట్రంలో మరిన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటుపై ముందుకు వెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వ పాఠశాలలను పునరుద్దరిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఎందరో గొప్ప నాయకులుగా, అధికారులుగా ఎదిగారని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రభుత్వ బడిలో చదువుకున్నవారేనని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బ్రతికేలా విద్యార్థులంతా విద్యలో రాణించాలని సూచించారు. ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, అధికారులుగా, రాజకీయ నాయకులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని సీఎం గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంతో పాటు కిట్స్ ను అందిచే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, డిసెంబరు 9 న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించుకోబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఇందుకోసం విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ నగరానికి తీసుకువచ్చి విద్యార్థులతో ఫుట్ బాల్ ఆడించామని తెలిపారు. దీనిపై కొందరు రాజకీయ విమర్శలు చేశారని, కడుపులో కుల్లు పెట్టుకుని రాజకీయం చేయాలనుకుంటున్న వాళ్లకు భవిష్యత్ లో ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా మిగల్చరని హెచ్చరించారు. విమర్శించే వాళ్లకు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను చూపించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వానికి అంతా అండగా నిలిస్తే అద్భుతాలని సృష్టిస్తామని, తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

**హెలిప్యాడ్ నుంచి స్కూల్ బస్సులో...**





తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ బస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. హెలికాప్టర్ నుంచి దిగిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి హెలిప్యాడ్ నుంచి స్కూల్ ప్రాంగణం వరకు స్కూల్ బస్సులోనే ప్రయాణించారు. స్కూల్ ప్రాంగణానికి చేరుకున్న అనంతరం పైలాన్ ఆవిష్కరించి స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలతో సంభాషించారు. థాంక్యూ సీఎం అంటూ తనకు స్వాగతం పలికిన విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు.

**పూరీ చేసి.. కిచెన్ ను పరిశీలించి...**



విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసిన సీఎం, బ్రేక్ ఫాస్ట్ తయారు చేసే కిచెన్ పరిశీలించారు. నేను మీలా పూరీ చేయగలనా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూరీ చేసి వంట చేసే మహిళలతో సరదాగా సంభాషించారు. అనంతరం ప్రీ-ప్రైమరీ తరగతి గదులను సందర్శించి చైల్డ్ లెర్నింగ్ యాక్టివిటీని సీఎం పరిశీలించారు. పాఠశాలలో లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్ ను సందర్శించారు.

**జామ మొక్కను నాటిన సీఎం**



తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జామ మొక్కను నాటారు. అనంతరం డాన్స్, మ్యూజిక్ రూమ్ ను సందర్శించి అక్కడి యాక్టివిటీని తెలుసుకున్నారు. అటు నుంచి ఫుట్ బాల్ గ్రౌండ్ కు వెళ్లి విద్యార్థులతో కాసేపు ఫుట్ బాల్ ఆడారు. అనంతరం బహిరంగ సభకు చేరుకుని విద్యార్థులు, స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు.




## ఆటోలో ప్రయాణించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

గోదావరి ఖని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కవిత బుధవారం నాడు గోదావరిఖని లో ఆటోలో ప్రయాణించారు. సింగరేణి ఏరియా హాస్పిటల్ పరిశీలించిన అనంతరం హాస్పిటల్ నుంచి గోదావరిఖని చౌరస్తాలోని హెచ్ఎంఎస్ ఆఫీస్ వరకు ఆటోలో ప్రయాణించచారు. ఆటో డ్రైవర్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

# విద్యాసంస్థల వాహన డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి - గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్



**పెద్దపల్లి, జూన్ 17, ప్రజాబలం ప్రతినిధి :** పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మరియు బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సును సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు,ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నైపుణ్యం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని సూచించారు. విద్యార్థులను ఎక్కించే సమయంలో,దించే సమయంలో నిర్దేశించిన ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని తెలిపారు. డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడపకూడదని, ఓవర్‌టేకింగ్ చేయరాదని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం లేదా సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు చేసే ఏ తప్పిదానికైనా సంబంధిత పాఠశాల లేదా కళాశాల యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి,రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవికుమార్, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు,బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ బాగారెడ్డి జయంతి



**జహీరాబాద్, జూన్ 17 ప్రజాబలం ప్రతినిధి:** మాజీ ఎంపీ మాజీ మంత్రి, స్వర్గీయ ఎం బాగా రెడ్డి జయంతి వేడుకలను జహీరాబాద్ లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బాగారెడ్డి విగ్రహానికి మాజీ ఎంపీ బీబీ పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం బాగా రెడ్డి స్వగృహంలో కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడు మార్లు ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు ఎంపీగా మంత్రిగా పనిచేసే ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీకి తన స్థానాన్ని ఇచ్చి గెలిపించి ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక జాతీయస్థాయి పరిశ్రమలను నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఘనత బాగ రెడ్డికి దక్కిందని కొనియాడారు.ఆయన చూపిన దారిలో నడుస్తూ వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శివాజీ రావు పాటిల్, న్యాయవాదులు పాండురంగారెడ్డి, బుచ్చిరెడ్డి, బిజెపి నాయకులు జగన్నాథ్, భాస్కర్, సుభాష్ రెడ్డి, కార్తీక్ రెడ్డి , బిజెపి నాయకులు, బాగా రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ కనెక్షన్లకు ఈ-కేవైసీ తప్పనిసరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 17:** ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ (పౌరసరఫరాలు) ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసర్ఫరాల అధికారి అధ్యక్షతన సహాయ పౌరసరఫరాల అధికారి ఉప్పల్ బాలానగర్ సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్స్ మరియు ఎల్పిజి డీలర్ మరియు మేనేజర్లు వారితో ఎల్పిజి వినియోగదారుల ఈ కేవైసీ పూర్తి చేయుట అనే అంశంపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఎల్పీజీ వినియోగదారులందరూ తప్పనిసరిగా వారి వారి ఈ కేవైసీని తేదీ 30-06-2026 లోపల పూర్తి చేయవలసిందిగా కోరడమైనది.

మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14 లక్షలు 49వేల 460 అందులో 4లక్షల 32వేలు ఎల్పిజి కన్స్యూమర్స్ ఈ కేవైసీ పూర్తి చేయవలసి ఉన్నది కావున జిల్లాలోని సమస్త ఎల్పిజి వినియోదారులందరూ తప్పకుండా తమ ఈ కేవైసీని తేదీ 30-06-2026 లోపల పూర్తి చేయాలని తెలిపారు.

# మంగళగిరిలో ప్రముఖ వస్త్ర వ్యాపారి.. మూడు కోట్లకు కుచ్చుటోపి..

మంగళగిరిలో ఓ ప్రముఖ వస్త్ర వ్యాపారి సాటి వ్యాపారస్తులకు ప్రముఖులకు మూడు కోట్ల రూపాయల మేర కుచ్చుటోపి పెట్టాడు. తనను నమ్మిన వారిని నట్టేట ముంచాడు. తన వ్యాపార అవసరాలు ఉన్నాయంటూ అందిన చోట అందినట్లు కోట్లల్లో అప్పులు తీసుకున్నాడు. అసలు సంగతి ఏమో కానీ వడ్డీ కూడా సరిగా ఇవ్వకపోగా తనకు వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయానంటూ "ఐపి" అంటూ చావు కబురు చల్లగా చెప్పి వ్యాపారస్తుల, నమ్మిన వారి నడి నెత్తిన శతగోపం పెట్టాడు. అందరినీ నమ్మించి నయవంచన చేశాడు .అతనిని నమ్మి వడ్డీ వస్తుందని ఆశపడి పైసా పైసా కూడ పెట్టుకుని వస్త్ర వ్యాపారి చేతిలో సొమ్మును ధారపోసి వేలల్లో, లక్షల్లో ఇచ్చిన వారికి సొమ్ము ఎగనామం పెట్టి వారికి పంగనామాలు పెట్టి నయవంచన చేశాడు. కోర్టు నుండి ఐపీ నోటీసులు అందుకున్న రుణదాతలు వ్యాపారి చేసిన అన్యాయానికి లబోదిబో మంటున్నారు .గుడ్లల్లో కన్నీళ్లు నింపుకొని బావురు మంటున్నారు .ఈ మూడు కోట్ల కుచ్చుటోపి కి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయిమంగళగిరిలో వాసు అనే వ్యక్తి దశాబ్దాల క్రితం చిన్న బట్టల వ్యాపారం ప్రారంభించాడు.అనతి కాలంలోనే వస్త్ర వ్యాపారంలోనే పేరు ప్రతిష్టలు గడించాడు. దీనికి తోడు సాటి కులస్తులు కూడా తమ వాడు మంచి వ్యాపారం చేస్తున్నాడని సంతోషించారు. దీనికి తోడు అందరిలో ఆ వ్యాపారి తలలో నాలుకలా మెలిగేవాడు. కొన్నేళ్లు గడిచిన తర్వాత పట్టణ ప్రముఖులలో వ్యాపారస్తులతో బంధువులలో స్నేహితులలో వివిధ ప్రాంతాలలోని వస్త్ర వ్యాపారులలో అతనిపై బాగా నమ్మకం కలిగింది.తన వ్యాపార విస్తరణ కోసం సొమ్ము అప్పు కావాలంటూ తనకు కావలసిన వారి వద్ద ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద లక్షల్లో అప్పులు వస్త్ర వ్యాపారస్తుల వద్ద వివిధ రకాల వస్త్రాలు లక్షల్లో అప్పులు తీసుకున్నాడు.

# విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సౌధలోని జెన్ కో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ సంస్థల ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా డీఏను పెంచే ప్రతిపాదనకు డిప్యూటీ సీఎం పచ్చ జెండా ఊపారు. విద్యుత్ ఉద్యోగులకు 1.621 శాతం మేర డీఏను పెంచుతూ ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితో విద్యుత్ ఉద్యోగుల డీఏ 17.651% నుంచి 19.272% కి చేరినట్లు అయింది. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు సుమారు రూ. 9.35 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. విద్యుత్ రంగ సంస్థల్లో పని చేస్తున్న మొత్తం 70,804 మంది సిబ్బంది, పెన్షనర్లు ఈ డీఏ పెంపు వల్ల ప్రయోజనం పొందనున్నారు.

ఈ సమావేశంలోనే విద్యుత్ రంగ పనితీరును ఉప ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రధానంగా రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ అధికారులు సన్నద్ధం కావాలని చెప్పారు. అలాగే రానున్న పదేళ్లను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగ సంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై ఆయన అధికారులుకు పలు సూచనలు చేశారు.

ఈ ఎండాకాలంలో రికార్డు స్థాయిలో గరిష్ట డిమాండ్ ఎదురైనా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూసిన అధికారులను, సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది మార్చి 27న పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరిందన్నారు. అయినా సరఫరాలో అంతరయాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు, సిబ్బంది పని చేశారని ఆయన అన్నారు. అలాగే మార్చి 13, 2026 న అత్యధికంగా 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాబోయే దశాబ్ద కాలానికి సమగ్రమైన, దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళికను సిద్ధం చేయాలని విద్యుత్ రంగ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాలని అన్నారు. రాష్ట్రంలో 2035-36 నాటికి పీక్ డిమాండ్ 34,137 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనాగా చెప్పారు. ఈ ఏడాది నమోదైన పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు దాదాపు రెట్టింపుగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా 2035-36 నాటికి వార్షిక విద్యుత్ అవసరాలు 1,52,626 మిలియన్ యూనిట్లకు (వీఖ) చేరుకుంటుందన్నారు.

వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్ కోలు అత్యంత సంసిద్ధంగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రధానంగా క్షేత్రస్థాయి అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, తక్షణమే రంగంలోకి దిగి లోపాలను సరిచేయాలని ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా సంభవించే విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్ కో సీఎండీ హరీష్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సంపత్ కుమార్, ట్రాన్స్ కో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీమతి లతా వినోద్ ఇతర విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే

## ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోని గుడిసెల వాసులకు అవకాశం

గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి గారు తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు

రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి గారు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి గారు తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

అసంపూర్తి ఇళ్లకు కూడా అవకాశం

గతంలో వివిధ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్మెంట్ స్థాయి లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు.

అలాగే గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారు

బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్) విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని మంత్రిగారు తెలిపారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలు కలిగిన లబ్ధిదారులకు అవసరాన్ని బట్టి గ్రౌండ్ ప్లస్ వన్ (జి+1) నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేవలం రెండున్నర సంవత్సరాల కాలం లో దశాబ్దాల పేదల సొంతింటి కలలను సాకారం చేస్తున్నామని మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైందని, ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ద్వారా లక్షలాది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపబోతున్నాం అని మంత్రి గారు అన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టుకు బస్సులు

శ్రీకాకుళం, జూన్ 17, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరి కొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. జూలై నుంచి అధికారికంగా విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. అయితే విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు చాలా రహదారులు ఉన్నాయి. 52 కిలోమీటర్ల దూరం కాగా.. ట్రాఫిక్ ఇబ్బందులతో దాదాపు రెండు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఈ ఇబ్బందులను అధిగమించి నేరుగా విశాఖ నగరం నుంచి ఎయిర్పోర్ట్ కు రహదారులను మెరుగుపరిచేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే విశాఖ నుంచి భోగాపురం వెళ్లడానికి విమాన ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం పై.. ఆంధ్రప్రదేశ్ విమాన ప్రయాణికుల సంఘం జీఎంఆర్ సంస్థకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. విమాన ప్రయాణికులు తమ సొంత కార్లపై భోగాపురం వెళితే ట్రాఫిక్ మరింత ఇబ్బందికరంగా మారుతుందని.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేసింది.విశాఖ నుంచి వచ్చే విమాన ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జీఎంఆర్ సంస్థ సరికొత్త ఆలోచన చేసింది. విశాఖ నగరంలో 9 చోట్ల వెయిటింగ్ లాంజ్ లు ఏర్పాటు చేయనుంది. దేశంలోనే తొలిసారి ఇటువంటి ఏర్పాట్లు చేయడం. తొలి విడతలో ఐదు లాంజ్ లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నంలో ఉంది. ఇందుకోసం జీఎంఆర్ గ్రూపు ముంబైలో ప్రత్యేకంగా కంటైనర్లను తయారుచేస్తోంది. 40 అడుగుల వెడల్పు, పది అడుగుల పొడవు కలిగిన కంటైనర్లు లాంజ్ రూపంలో అందుబాటులోకి రానున్నాయి. భోగాపురం వెళ్లాల్సిన విమాన ప్రయాణికులు వారికి సమీపంలో ఉన్న కంటైనర్ల వద్దకు చేరుకుంటే.. అక్కడి నుంచి ఆర్టీసీ నడిపే ఎలక్ట్రిక్ బస్సుల్లో భోగాపురం ఎయిర్పోర్ట్ వెళ్ళవచ్చు. దీనివల్ల విమానాశ్రయ మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. తక్కువ చార్జీలతో విమానాశ్రయానికి చేరుకోవచ్చు. భారతదేశంలోనే తొలిసారిగా విమాన ప్రయాణికుల కోసం కంటైనర్ లాంజ్ అందుబాటులోకి వస్తుండడం విశేషం.విశాఖ మహా నగరానికి ప్రభుత్వం 50 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించింది. వాటిలో తొలి విడత 20 బస్సులు నాలుగు రోజుల్లో విశాఖకు రానున్నాయి. మరోవైపు చార్జింగ్ స్టేషన్ల నిర్మాణం కూడా చురుగ్గా సాగుతోంది. బస్సులు రాగానే ట్రైల్ రన్ కూడా నిర్వహిస్తారు. వీటిలో పది బస్సులు గాజువాక నుంచి జాతీయ రహదారిలో ఆనందపురం మీదుగా భోగాపురం వరకు తిరుగుతాయి. మరో 10 బస్సులు గాజువాకలో బయలుదేరి నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల మీదుగా భోగాపురం విమానాశ్రయానికి వెళ్తాయి. ట్రయల్ రన్ లో భాగంగా చెక్ ఇన్ కౌంటర్లు, లగేజీ స్కానింగ్ వంటి వాటికి సంబంధించి ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మరోవైపు జూలై 5న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం రావాల్సి ఉంది.

అప్పుడే రద్దీ

విజయనగరం జిల్లాలో నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. నెలల కిందట ప్రధాన పనులు జరగడంతో రాయల్ రన్ కూడా జరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన తొలి ఎయిర్ ఇండియా వాలిడేషన్ ఫ్లైట్ భోగాపురం విమానాశ్రయం రన్ వే పై దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారీ విమానాలు కూడా ల్యాండ్ అయ్యేలా భోగాపురం ఎయిర్పోర్ట్ రన్ వేను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ ట్రయల్ రన్ విజయంతో రన్ వే సామర్థ్యం, భద్రత ప్రమాణాలపై అధికారులకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. దాదాపు పెండింగ్ పనులన్నీ తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోందిరాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించారు. ఈ ఎయిర్పోర్ట్ అందుబాటులోకి వస్తే విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు మాత్రమే కాకుండా ఒడిస్సా సరిహద్దు ప్రాంతాలకు కూడా ఇది ప్రధాన విమాన కేంద్రంగా మారనుంది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు విశాఖపట్నం ఉన్న విమాన ప్రయాణ భారం తగ్గడంతో పాటు.. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం తో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన విమాన సేవలు లభించనున్నాయి. ప్రస్తుతం ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో సందర్శకులతో కిటకిటలాడుతోంది. విశాఖకు వచ్చే పర్యాటకులు సైతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రద్దీగా మారడం విశేషం.

# అనిత వర్సెస్ అమర్నాధ్...

విశాఖపట్టణం, జూన్ 17, టీడీపీ మంత్రి? అండ్ వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా సమన్వయకర్త. ఈ ఇద్దరు నేతల కేరాఫ్ అడ్రస్ అనకాపల్లి జిల్లానే. రాజకీయంగా టామ్ అండ్ జెర్రీ ఫైటింగే. రెండు పార్టీలకు చెందిన మిగిలిన నేతలు కాస్త అటో ఇటో సంయమనం పాటించినా.. ఈ ఇద్దరిది మాత్రం ఛాన్స్ దొరికితే రప్పా.. రప్పానే..! తాము ప్రతిపక్ష నేతగా.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పదునైన వ్యాఖ్యలతో విరుచుకుపడే వారు అనిత. ఆమెకు కౌంటర్ ఇవ్వడానికి అమర్నాథ్ ఘాటుగానే స్పందించే వారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రి అయ్యారు అనిత. అందులోనూ? హోం లాంటి పవర్ ఫుల్ శాఖకు మంత్రి కావడంతో ఆమె మీద అటెన్షన్ పెరిగింది. టీడీపీ అధిష్టానానికి దగ్గరగా ఉండటం, కీలక కమిటీల్లో సభ్యురాలు అవడం వంటి కారణాలతో అనిత ప్రాధాన్యత బాగా పెరిగిందన్నది విస్తృతాభిప్రాయం. అదే సమయంలో హోం మంత్రి రాజకీయంగా చేసే విమర్శలు ఇటీవల ఘాటెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి చేసే వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండి పడుతూ ఉంటారు. ఈ క్రమంలో అనిత దూకుడుకు బ్రేకులు వేయాల్సిందేనని డిసైడ్ అయ్యారట వైసీపీ లీడర్స్. తమ అధినేత, ఆయన కుటుంబ సభ్యుల పట్ల హోం మంత్రి వాడే భాష సరిగా లేదంటూ ఆమెకు.. ఆ భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరిస్తుంటారు ప్రతిపక్ష నాయకులు చాలామంది.అయితే? ఆ విషయంలో అందరికంటే ముందుగా కుండబద్దలు కొట్టేశారు మాజీ మంత్రి అమర్నాథ్. వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో చోడవరంలో భారీ బైక్ ర్యాలీ చేశారు అమర్నాథ్. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ కాక రేపాయి. జిల్లాలో ఒక మేకప్ మంత్రి ఉన్నారంటూ మొదలుపెట్టి.. మాజీ మినిస్టర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మా మేడంను అంత మాట అంటారా అంటూ పాయకరావుపేట టీడీపీ నాయకులు ముందు గళం విప్పారు. ఆ తర్వాత తెలుగు మహిళలు తెరపైకి వచ్చి తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేశారు. కోడిగుడ్లతో అమర్నాథ్ ఫ్లెక్సీ మీద కొట్టి దిష్టి బొమ్మ దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ? అదంతా దిగువ స్థాయిలోనే. కానీ.. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఏకైక మంత్రిని ఉద్దేశించి మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యేలు పెద్దగా ఎందుకు రియాక్ట్ అవలేదన్నది బిగ్ క్వశ్చన్. విశాఖ జిల్లాలో టీడీపీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. అయినా ఎమ్మెల్యేల స్థాయిలో రియాక్షన్స్ లేకపోవడానికి కారణాలను వెదుకుతున్నాయి రాజకీయ వర్గాలు. అమర్నాధ్ చోడవరంలో అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు కాబట్టి? మీ అభిప్రాయం ఏంటని మీడియా అడిగితే స్థానిక ఎమ్మెల్యే రాజు స్పందించారు. రాజకీయాల్లో భాష హుందాగా ఉండాలని, అమర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ముక్తసరిగా చెప్పి వదిలేశారు.ఇక మూడు రోజుల తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పందించారు. అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు మించి మిగతా కూటమి ఎమ్మెల్యేలు ఎవ్వరూ కిక్కురుమనలేదు. మాట్లాడిన ఇద్దరూ కూడా ఏదో తప్పదన్నట్టు స్పందించారన్న అభిప్రాయం ఉంది. మామూలుగా అయితే.. రాష్ట్ర హోం మంత్రి, అందునా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిని ఉద్దేశించి ఆ స్థాయిలో మాజీ మంత్రి వ్యాఖ్యలు చేసినప్పుడు ఎదురు దాడి నెక్స్ట్ లెవల్లో ఉండాలి. పార్టీ నాయకత్వం మొత్తం మూకుమ్మడిగా విరుచుకుపడితోందా అనే భావన ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి బలంగా వెళ్ళాలి. కానీ ఇక్కడ అలాంటివేం జరక్కపోగా.. తప్పదన్నట్టుగా ఇద్దరు స్పందించారు. మిగతా వాళ్ళంతా మాకేం సంబంధం అన్నట్టుగా ఎందుకు ఉన్నారంటూ ఆరా తీస్తున్నారు పొలిటికల్ పరిశీలకులు. కూటమిగా కాకపోయినా కనీసం టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలుగా అయినా మాజీ మంత్రికి గట్టి కౌంటర్ ఇవ్వవచ్చుగానీ.. ఆ పని కూడా చేయలేకపోవడానికి ప్రత్యేక కారణాలు ఏవైనా ఉన్నాయా అంటూ ఎంక్వైరీ చేస్తున్నారు. ఈ పరిస్థితికి మంత్రి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణం అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. అనితతో పోలిస్తే ఇక్కడ కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలంతా రాజకీయంగా సీనియర్లు. అలాంటి చాలా మందికి అవకాశాలు ఆలస్యంగా వస్తే.. అనిత దశాబ్ద కాలంలోనే రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఛాన్స్ దక్కించుకున్నారు.కేబినెట్తో పాటు హైకమాండ్ దగ్గర లభిస్తున్న ప్రయారిటీ కారణంగా ఆమె జిల్లా ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకునే విషయంలో కాస్త అలసత్వం ప్రదర్శించారని, ఇంకా చెప్పాలంటే నాకేంటి అన్నట్టు వ్యవహరిస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. విశాఖ సిటీ శాసనసభ్యులు అయితే స్థానిక వ్యవహారాల్లో మంత్రిగా అనిత జోక్యాన్ని అస్సలు అంగీకరించడం లేదన్న గుసగుసలు ఉన్నాయి. అందుకే శాఖాపరమైన అంశాల మీద తప్ప విశాఖ నగరానికి సంబంధించిన వ్యవహారాల్లో ఆమె ప్రమేయం బాగా తగ్గిందని అంటున్నారు. ఇక్కడ తగ్గింది అనడం కంటే తగ్గించారనడమే కరెక్ట్ అన్నది చాలామంది ఫీలింగ్. ఇక అనకాపల్లి జిల్లా ఎమ్మెల్యేలతోనూ దాదాపు ఇదే వ్యవహార శైలి ఉందట. జిల్లాకు సంబంధించిన అంశాల మీద ఎమ్మెల్యేలతో సమావేశాలు పెట్టడంగానీ, వాళ్ళ అభిప్రాయాలు తీసుకుని అందుకు అనుగుణంగా నిర్ణయాలు అమలు చేయడం కానీ లేదట. అన్నింటికి కేరాఫ్ హైకమాండ్ అంటున్నారని.. అలాంటప్పుడు ఆమెను ఎవరో ఏదో అంటే.. మేం రాజకీయ ఎదురుదాడికి ఎందుకు వెళ్ళాలని ఓ సీనియర్ నేత అన్నారట. దీంతో.. ఉమ్మడి విశాఖ జిల్లాలో హోం మంత్రి ఒంటరి అయ్యారా అన్న సందేహాలు వస్తున్నాయట పరిశీలకులకు. ఈ ఎపిసోడ్ తర్వాత అది క్లియర్గా కనిపిస్తోందన్నది వాళ్ళ ఒపీనియన్.

# 19న కూటమి సక్సెస్ రీ సౌండ్

విశాఖపట్టణం, జూన్ 17, ఏపీలో టీడీపీ కూటమి రెండేళ్ళ పాలన పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి సభను రాయలసీమ రీజియన్ లో నిర్వహించారు. అది బ్రహ్మాండమైన తీరులో సక్సెస్ అయింది అని కూటమి నేతలు అంతా ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో రెండవ సభకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వారాంతంలో విశాఖలో పెద్ద ఎత్తున సభను నిర్వహించి ఉత్తరాంధ్రాలో కూటమి సక్సెస్ మీద రీసౌండ్ చేయాలని భావిస్తున్నారు.ఈసారి విశాఖలో నిర్వహించే సభకు కేంద్ర మంత్రులు పలువురు హాజరవుతారని అంటున్నారు. అలాగే ఏపీలోని కీలక మంత్రులు అంతా ఈ సభకు వస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్ తో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్ రామ్మోహన్ నాయుడు సహా అంతా ప్రసంగించబోతున్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పాలనకు 12 ఏళ్ళు పూర్తి కావడంతో ఆ సంబరాలను అలాగే ఏపీలో కూటమి రెండేళ్ళ విజయోత్సవాలను కలిపి నిర్వహిస్తామని చెబుతున్నారు ఈ నెల 19న విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో నిర్వహించే ఈ సభకు ఏర్పాట్లు జోరుగా చేస్తున్నారు. వేలాదిగా ప్రజానీకం ఈ సభకు హాజరవుతుందని అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్రాలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా కూటమి నేతలు తెలియ చేస్తారని అంటున్నారు. రెండేళ్ళలో పెద్ద ఎత్తున పరిశ్రమలు విశాఖ సహా మూడు జిల్లాలకు వచ్చిన సంగతిని కూడా గుర్తు చేస్తున్నారు. కూటమికి ఉత్తరాంధ్రాలో ఇప్పటికే రాజకీయంగా మంచి పట్టు ఉంది. దానిని మరింతగా బిగించేందుకు ఈ విజయోత్సవ సభను ఉపయోగించుకుంటారని అంటున్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థలు జరగనున్నాయి. దాంతో ఆ ఎన్నికల కోసం కూడా ఈ తరహా సభని వినియోగించుకోవాలన్న ప్రణాళికతో కూటమి పెద్దలు ముందుకు సాగుతున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఏకపక్షంగా ఉత్తరాంధ్ర కూటమికి జై కొట్టింది. ఏజెన్సీలో రెండు సీట్లు తప్ప మొత్తం అన్నీ కూటమి పార్టీలే గెలుచుకున్నాయి. ఇపుడు తాము అభివృద్ధి చేసి చూపిస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే ఈ నెల 19న జరిగే సభ అదిరిపోయే లెవెల్ లో ఉంటుందని కూటమి నాయకులు చెబుతున్నారు. తిరుపతి సభను మించేలా జరపాలని చూస్తున్న కూటమి నేతల ప్రయత్నాలు ఒక ఎత్తు అయితే విశాఖ సభ చేసే రీ సౌండ్ పొలిటికల్ గా ఏపీలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది అన్నది చర్చగా ఉంది. చూడాలి మరి ఈ సభలో చంద్రబాబు పవన్ లోకేష్ ఇచ్చే స్పీచ్ ల వేడి వాడి ఎలా ఉండబోతోందో.

# మళ్లీ యాక్టివ్ కానున్న భార్గవ్ రెడ్డి

విజయవాడ, జూన్ 17, అధికారం పోయాక అగ్రెసివ్నెస్ పోయింది.. టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టడం మరచిపోయి అకౌంట్నే పోగొట్టుకున్నారా? వైసీపీ సోషల్ మీడియాకు పట్టిన 'హ్యాకింగ్' గ్రహణాన్ని వీడించాలంటే.. మళ్లీ ఆ 'భార్గవ' రాముడే రావాలా? ఇప్పుడు నెట్టింట ఇదే చర్చ నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో ఇటీవల జరిగిన ఒక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వైసీపీ అధికారిక ఫేస్బుక్ అకౌంట్ హ్యాక్కు గురికావడం.. అందులో హ్యాకర్లు అసభ్యకరమైన కంటెంట్ను పోస్ట్ చేయడంతో మెటా యాజమాన్యం ఆ పేజీని బ్లాక్ చేసింది. ఈ ఘటన పార్టీ శ్రేణులను తీవ్రగ్భ్రాంతికి గురిచేయడమే కాకుండా వైసీపీ సోషల్ మీడియా విభాగ నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రస్తుతం నెటిజన్లు, పార్టీ మద్దతుదారుల మధ్య ఒకే ఒక చర్చ నడుస్తోంది.. "వైసీపీ సోషల్ మీడియా మళ్లీ పూర్వవైభవం సాధించాలంటే సజ్జల భార్గవ్ రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపట్టాల్సిందేనా? అన్న చర్చ సాగుతోంది. సాధారణంగా ఒక ప్రధాన రాజకీయ పార్టీకి సంబంధించిన అధికారిక సోషల్ మీడియా ఖాతాలకు అత్యున్నత స్థాయి భద్రత ఉండాలి. కానీ తాజా హ్యాకింగ్ ఘటన చూస్తుంటే అడ్మిన్లు కనీస జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైబర్ నిపుణుల అభిప్రాయం ప్రకారం అడ్మిన్లలో ఎవరో ఒకరు అనుమానాస్పద లింక్లను క్లిక్ చేయడం... సిస్టమ్ లేదా అకౌంట్ పాస్వర్డ్లను చాలా సాదాసీదాగా ఉంచడం... టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వంటి ప్రాథమిక భద్రతా ప్రమాణాలను ఎనేబుల్ చేయకపోవడం.. ఇలాంటి సాంకేతిక నిర్లక్ష్యం వల్లే లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న అధికారిక పేజీ హ్యాకర్ల చేతుల్లోకి వెళ్ళిపోయిందని.. ఇది పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆ తర్వాత మందగమనం వైసీపీ 2014 నుండి 2019 వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దాని సోషల్ మీడియా వింగ్ అత్యంత 'ఆర్గానిక్'గా పకడ్బందీగా పనిచేసింది. అప్పట్లో ప్రత్యర్థులపై డిజిటల్ వేదికలపై వైసీపీ సాధించిన పైచేయి పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ సోషల్ మీడియాలో ఆ పాత దూకుడు కనిపించలేదు. ప్రభుత్వంలో బిజీ అయిపోవడం వల్లో..లేదా సరైన లీడర్షిప్ లేకపోవడం వల్లో కానీ డిజిటల్ వేదికలపై పార్టీ పట్టు సడలిందనేది వాస్తవం.అగ్రెసివ్ పాలిటిక్స్ ఈ క్రమంలోనే సజ్జల భార్గవ్ రెడ్డి వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఎంట్రీతో సీన్ పూర్తిగా మారిపోయింది. భార్గవ్ రెడ్డి తన టీమ్తో కలిసి సోషల్ మీడియాను అత్యంత వ్యూహాత్మకంగా, అగ్రెసివ్గా మార్చారు. కార్యకర్తల అభిప్రాయం ప్రకారం .. "భార్గవ్ రెడ్డి ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో సోషల్ మీడియా సైన్యం క్షణం కూడా ఆలస్యం చేయలేదు. టెక్నికల్ సెక్యూరిటీతో పాటు పొలిటికల్ కౌంటర్లలోనూ ఆయన టీమ్ పర్ఫెక్ట్ సిస్టమాటిక్ అప్రోచ్ను ఫాలో అయ్యింది. అయితే ఇటీవల ప్రభుత్వం దిగిపోయిన తర్వాత భార్గవ్ రెడ్డి, ఆయన కోర్ టీమ్ వైసీపీ సోషల్ మీడియా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వారు పక్కకు తప్పుకున్న కొద్ది రోజులకే ఇలాంటి భారీ భద్రతా లోపం జరగడం.. ఏకంగా ఫేస్బుక్ పేజీనే కోల్పోవాల్సి రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికల్లో వైసీపీ అభిమానులు, కార్యకర్తలు ఒకే విషయాన్ని డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ భార్గవ్ రెడ్డినే రంగంలోకి దించాలని కోరుతున్నారు. ఆయన వస్తేనే సోషల్ మీడియా మళ్లీ గాడిలో పడుతుందని.. ప్రత్యర్థులకు గట్టి కౌంటర్లు ఇవ్వడం సాధ్యమవుతుందని గట్టిగా నమ్ముతున్నారు. వ్యక్తుల మార్పు కంటే సోషల్ మీడియా నిర్వహణకు బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు అవసరమని నిపుణులు చెబుతున్నప్పటికీ రాజకీయాల్లో వ్యూహాలు ప్రతివ్యూహాలు నడపడానికి సమర్థుడైన లీడర్ అవసరం. మరి ఈ సంక్షోభం నేపథ్యంలో వైసీపీ అధిష్టానం సోషల్ మీడియా బాధ్యతలను మళ్లీ భార్గవ్ ?డికి అప్పగిస్తుందా? లేక కొత్త వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అనేది వేచి చూడాలి.

# రంగంలోకి మోపిదేవి వారసుడు...

గుంటూరు, జూన్ 17, ఉమ్మడి గుంటూరు జిల్లా లోని రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ఆసక్తికరంగా ఉండే ప్రాంతంగా గుర్తింపు పొందింది. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు తరచూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతుంటాయి. ప్రస్తుతం ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పుంజుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.రేపల్లెలో గత మూడు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన అనగాని సత్యప్రసాద్ తన ప్రభావాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా కూడా ఆయనకు గణనీయమైన ప్రజాభిమానం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో 2029 ఎన్నికల్లో ఆయనకు గట్టి పోటీ ఇవ్వాలంటే ప్రత్యేక వ్యూహం అవసరమని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున మోపిదేవి వెంకటరమణ ఇక్కడ విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. అనంతరం ఆయన వైసీపీలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఎన్నికల్లో ఓడినా ఎమ్మెల్సీ, మంత్రి, తరువాత రాజ్యసభ సభ్యునిగా అవకాశాలు పొందారు. అయితే ఇటీవల ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడంతో రేపల్లె రాజకీయ సమీకరణాలు మారిపోయాయి.ఇదిలా ఉంటే, వైసీపీ కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. రేపల్లెలో గౌడ , కాపు సామాజిక వర్గాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ రెండు వర్గాల మద్దతు సాధించిన అభ్యర్థికి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని అంచనా. అందుకే పార్టీ సామాజిక సమీకరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.ఈ క్రమంలో మోపిదేవి శ్రీనివాస్ ను పార్టీలో చేర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనకు భవిష్యత్తులో కీలక బాధ్యతలు లేదా టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న పీట నాగ మోహన్ కృష్ణ కూడా పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు.అయితే ఈ ఇద్దరు నాయకులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు, ప్రస్తుతం వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. దీంతో పార్టీ శ్రేణుల్లో కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. ఒక వర్గం మోపిదేవి శ్రీనివాస్కు మద్దతు ఇస్తుండగా, మరో వర్గం పీట నాగ మోహన్ కృష్ణ నాయకత్వాన్నే బలపరుస్తోంది.ఈ పరిస్థితుల్లో రేపల్లెలో వైసీపీ అంతర్గత సమన్వయం కీలకంగా మారింది. పార్టీ నాయకత్వం ఈ విభేదాలను పరిష్కరించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకురాగలిగితేనే వచ్చే ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వగలదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఇప్పటికే బలంగా ఉన్న అనగాని సత్యప్రసాద్కు మరోసారి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పవన్ నార్త్ పై గురి



విజయవాడ, జూన్ 17, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లో జాతీయ భావాలు ఎక్కువ. ఆయన ప్రాంతీయవాదానికంటే జాతీయ సమైక్యతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. ఆ భావనతోనే నిన్న ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన సంకేతాలు పంపారు. తన రాజకీయ పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలన్న ఆలోచన పవన్ లో కనిపించింది. కేవలం ప్రాంతీయ రాజకీయాలకే పరిమితం కాకుండా? ఢిల్లీ వేదికగా జాతీయ రాజకీయాల్లో ఒక స్పష్టమైన, కీలకమైన పాత్ర పోషించాలనే సంకల్పం పవన్ కళ్యాణ్ లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా పవన్ నోటి నుంచి పదేపదే జాతీయవాదం రావడం వెనుక పక్క వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోందిపవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం చూస్తే ఆయన ఆరాటం అధికారం కోసం కాదు. నిర్దిష్టమైన సిద్ధాంతాలతో పాటు దేశభక్తి పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. భారతీయత అనే ఉమ్మడి సూత్రం, బలమైన జాతీయవాద భావజాలం ఆయనలో కనిపిస్తుంది. ఢిల్లీ సమావేశంలో ఆయన ప్రసంగించిన తీరు, ఎంచుకున్న అంశాలు తీసుకుంటే ఒక ప్రాంతీయ పార్టీ నేతగా కాకుండా? దేశ విశాల ప్రయోజనాల దృక్పథం ఉంది. అయితే జనసేన తాజా సంకేతాలు చూస్తే మాత్రం పవన్ కళ్యాణ్ అడుగులు జాతీయస్థాయి వైపు వేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉన్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో సైతం బిజెపి తెలుగుదేశం పార్టీతో జత కట్టడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. అందుకే మోడీతో పాటు అమిత్ షా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక గౌరవంతో ఉంటారు. అందుకే త్వరలో నరేంద్ర మోడీ పవన్ కళ్యాణ్ కు దేశవ్యాప్తంగా ఒక బాధ్యత కట్టబెడతారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. దేశవ్యాప్తంగా సనాతన ధర్మ రక్షణ, సామాజిక సమతుల్యం, యువతను దేశ నిర్మాణం వైపు మళ్లించడం వంటి అజెండాలతో.. జనసేన ను జాతీయస్థాయిలో బలోపేతం చేయాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించాలనుకునేవారు చాలా తక్కువ. ఒకవేళ వారు వెళ్లిన ప్రాంతీయ ప్రయోజనాల కోణంలోనే చూస్తుంటారు తప్ప.. సమైక్య భావనతో కాదు. ఆ శూన్యతను భర్తీ చేయాలనుకుంటున్నారు పవన్ కళ్యాణ్. హిందీ తో పాటు ఇంగ్లీష్ లో ఉన్న పట్టు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయనకున్న క్రేజ్, సనాతన ధర్మంపై ఆయనకు ఉన్న స్పష్టమైన స్టాండ్, జాతీయస్థాయిలో ఉన్న పలుకుబడి, ఏపీ ప్రజల మద్దతు వెరసి.. దేశ రాజకీయాలను ప్రభావితం చేయగల సామర్థ్యం పవన్ కళ్యాణ్ సొంతం. పవన్ కళ్యాణ్ కేవలం ఏపీ డిప్యూటీ సీఎం పదవితో ఆగిపోకుండా.. దేశ రాజకీయ గమనంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధం కావడం జనసైనికుల్లో జోష్ నింపుతోంది. ఢిల్లీ పెద్దలతో ఆయనకు వ్యూహాత్మక సంబంధాలు జాతీయ నాయకుడిగా తీర్చిదిద్దుతాయని జనసైనికులు బలంగా భావిస్తున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## చైతన్యపురిలో పోలీస్ అభ్యర్థుల మహా ధర్నా

హైదరాబాద్ పోలీస్ నియామకాల్లో వయోపరిమితి పెంపుతో పాటు పెండింగ్లో ఉన్న నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పోలీస్ అభ్యర్థుల జేఏసీ ఆధ్వర్యంలో చైతన్యపురిలో మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పోలీస్ అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, 19/20 పే స్కేల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కానిస్టేబుల్ పోస్టులకు 36 సంవత్సరాలు, ఎస్ఐ పోస్టులకు 38 సంవత్సరాల వయోపరిమితి కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

## అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ ఉక్కుపాదం..!

### ఇందిరమ్మ ఇండ్ల పేరుతో సాగిన ఇసుక దందా బట్టబయలు

వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలో అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ కొరడా ఝుళిపించింది. ఇందిరమ్మ ఇండ్లు, నేషనల్ హైవే పనుల పేరుతో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 15 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ డి.ఎస్. చౌహన్, హైదరాబాద్ రూరల్ ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు యాలాల, తాండూర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి అడ్డుకున్నారు.విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న డ్రైవర్లు, కూలీలు ట్రాక్టర్లను అక్కడికక్కడే వదిలేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 9 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసిన అధికారులు, మిగిలిన వాహనాల యజమానులు, నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, నేషనల్ హైవే పనుల పేరుతో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని అధికారులు గుర్తించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలనుఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.తాండూర్,యాలాలమండలాల్లో గత కొంతకాలంగావిస్తృతంగాకొనసాగుతున్న ఇసుక దందాపై విజిలెన్స్ శాఖ చేపట్టిన ఈ సడెన్ ఆపరేషన్తో ఇసుకమాఫియాలో కలకలం రేగింది. భవిష్యత్తులో కూడా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## పెళ్లిళ్ల సీజన్ స్టార్ట్....

### వేలాది కళ్యాణాలు...

హైదరాబాద్, జూన్ 17,అధిక జ్యేష్ఠ మాసం కారణంగా నిలిచిపోయిన శుభకార్యాలకు బ్రేక్ పడింది. నిజ జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి తిథి ప్రారంభం కావడంతో, జులై 12వ తేదీ వరకు వరుసగా అత్యంత బలమైన సుముహూర్తాలు ఉన్నాయని ప్రముఖ వేద పండితులు స్పష్టం చేస్తున్నారు. ఈ సుదీర్ఘ విరామం తర్వాత వస్తున్న ముహూర్తాలు కావడంతో ప్రతీ రోజూ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ముహూర్తాల సీజన్ జూన్ నెల రెండో సగం నుంచి ప్రారంభమై, జులై రెండో వారం వరకు నాన్-స్టాప్గా సాగనుంది. వేద పండితుల పంచాంగ గణనం ప్రకారం జూన్ నెలలో అత్యధికంగా ముహూర్తాలు అందుబాటులో ఉన్నాయి. జూన్ 16, 17, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో వరుసగా కల్యాణ ఘడియలు ఉన్నాయి. అలాగే జులై నెల ప్రారంభంలోనూ మంచి రోజులు కుదిరాయి. జులై 1, 6, 7, 9, 10, 11 తేదీల్లో వివాహాలు నిశ్చయించుకోవడానికి, లగ్న పత్రికలు రాసుకోవడానికి అత్యంత అనుకూలమైన రోజులుగా పండితులు నిర్ణయించారు.కేవలం పెళ్లిళ్లే కాదు.. గృహప్రవేశాలు, శంకుస్థాపనలకూ ఇదే మంచి సమయంఈ ముహూర్తాల సీజన్ కేవలం వివాహాలకే పరిమితం కావడం లేదు. కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టేందుకు చూస్తున్న వారికి నూతన గృహ ప్రవేశాలు చేయడానికి, కొత్త వ్యాపారాలు లేదా నూతన కట్టడాలకు శంకుస్థాపనలు నిర్వహించడానికి ఈ కాలం అత్యంత శ్రేష్ఠమైనదిగా భావిస్తున్నారు. అంతేకాకుండా, పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు, ప్రతిష్ఠాత్మక ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఇదే కాలంలో భారీ ఎత్తున చేపట్టేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, మంగళకర వాతావరణం నెలకొంది.వరుస ముహూర్తాల నేపథ్యంలో మార్కెట్లలో వ్యాపారాలు ఒక్కసారిగా జోరందుకున్నాయి. పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వారు రెండు, మూడు నెలల ముందే అప్రమత్తమై కల్యాణ మండపాలను బుక్ చేసుకోవడంతో ప్రస్తుతం ఎక్కడా చూసినా మండపాల కొరత కనిపిస్తోంది. ఇటు బంగారు ఆభరణాల దుకాణాలు, కొత్త వస్త్రాల షోరూమ్లు, పూజా సామాగ్రి విక్రయ కేంద్రాలు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు డిజిటల్ మీడియా యుగంలో ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థలకు, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ టీమ్లకు డిమాండ్ భారీగా పెరిగింది. పెళ్లి వాయిద్యాల కళాకారులు, క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని దొరకడంతో ఈ సీజన్ అందరి జీవితాల్లోనూ ఆర్థికంగా కొత్త వెలుగులు నింపుతోంది. దాదాపు నెల రోజుల పాటు సాగనున్న ఈ మంగళకర సీజన్ స్థానిక ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

### గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హనుమకొండ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగి ప్రభుత్వంపై తిరుగుబాటు అనివార్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు.

హనుమకొండ జిల్లా గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో నిర్మించిన "సురవరం సుధాకర్ రెడ్డి నగర్" సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల పోరాటాల వల్లే తెలంగాణ విముక్తి సాధ్యమైందని, ప్రజా హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

గుండ్లసింగారం కాలనీవాసులు ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారని అభినందించారు. కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో, అవసరమైతే ముఖ్యమంత్రితో కూడా మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గుడిసెవాసుల హక్కుల సాధన కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్, జిల్లా నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, వందలాది మంది కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ శాసన సభా పతి..రైతుల మీద కేసులు పెట్టి జైలుకు పంపుతారా? డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ అమ్మ పెట్టదు అడుక్కొనివ్వదు అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు అనంద్ అన్నారు. మర్పల్లి మండలం, తుమ్మలపల్లి గ్రామంలో అభివృద్ధిని అడ్డుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రోడ్డు పక్కన గ్రామంలో గుంతలు ప్రభుత్వం పూల్చడం లేదు, ప్రజలు శ్రమదానం చేసి పూడ్చుకుంటామంటే కేసులు పెడతామంటుండ్రని అన్నారు.రైతులు పొలాలకు కంతతోవను సాఫ్ చేసుకుంటే వాళ్లను జైలుకు పంపిస్తాం అంటుండు. యధా రాజా తథా ప్రజా అన్నట్టు.. రైతుల విషయంలో రేవంత్ రెడ్డి గారు ఏది చేస్తుందో స్పీకర్ గారు దాన్ని ఆచరిస్తున్నారు. తుమ్మలపల్లి లో బిఆర్ఎస్ సర్పంచి ఉన్నాడని కక్షగట్టి ఈ విధంగా చేస్తున్నారని ఆరోపించారు.

# ఎల్ నినో .. డ్రై ల్యాండ్ క్రాప్స్

హైదరాబాద్, జూన్ 17, ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీనివల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటోంది.. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలు ఆరుతడి పంటల వైపు దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. వర్షాలు తగ్గడం వల్ల కరవు పరిస్థితులు, వ్యవసాయ రంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉందని వివరిస్తున్నారు.. పంటల దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, రైతులలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.. అలాగే అందుబాటులో ఉన్న వనరులతో పాటు మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయం చేయలని సూచిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాలతోపాటు.. వర్షాలు, ఎక్కువగా నీటిపై ఆధారపడే వారు ఖరీఫ్ లో వర్షాధారంగా లేదా తక్కువ నీటి తడులతో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం ఎంతో అవసరం. ఆరుతడి పంటలు వల్ల నష్టాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

ఖరీఫ్ సీజన్లో అనువైన ప్రధాన ఆరుతడి పంటలు:

అపరాలు- పప్పుధాన్యాలు

కందులు: తేమ తక్కువగా ఉండే ఎర్ర నేలలు, మెట్ట ప్రాంతాలకు ఇవి చాలా అనుకూలం.. నీటిని తక్కువగా ఉపయోగించుకోని సాగు చేసుకోవచ్చు..

పెసర ? మినుము: పెసర, మినుము 75-90 రోజుల్లో చేతికి వచ్చే పంటలు.. వీటికి నీరు కూడా తక్కువ అవసరం ఉంటుంది.

నూనె గింజలు

వేరుశనగ: వర్షాలు తక్కువగా ఉన్నా తేలికపాటి నేలల్లో బాగా పండుతుంది. వేరుశనగ (పల్లి) పంటకు సాధారణంగా నీరు ఎక్కువగా అవసరం లేదు.

సోయాబీన్: నల్లరేగడి నేలలు, తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాగు చేయడానికి ఇది ఉత్తమమైన ఎంపిక.

నువ్వులు: ఖరీఫ్ ప్రారంభంలో (తొలకరి) వేసుకోవడానికి అనువైన నూనె గింజ పంట.

చిరుధాన్యాలు

జొన్న, సజ్జలు, రాగి .. నీటి వనరులు తక్కువగా ఉన్నా, వర్షాలు అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంటలు సులువుగా పెరుగుతాయి.

మొక్కజొన్న కూడా అద్భుతమైన ఆరుతడి పంట. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ, అధిక దిగుబడిని, మంచి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా, ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు దీనిని సాగు చేసుకోవచ్చు.

అయితే.. సాధారణంగా ఖరీఫ్ కాలంలో అధిక వర్షపాతం కారణంగా రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఎల్ నీనో ప్రభావంతో నీటి వనరులు తక్కువగా ఉండే అకాశం ఉండటంతో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటలు బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు.

ఎల్ నినో సమయంలో ఆరుతడి పంటలు వేయడంతో పాటు.. బిందు సేద్యం లేదా తుంపర సేద్యం పద్ధతులను వాడితే ఉన్న కొద్దిపాటి నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చు. అలాగే నేలలో తేమ ఆరిపోకుండా మల్చింగ్ పద్ధతిని కూడా ప్రయత్నించవచ్చు.

## మహారాష్ట్రలో ఆపరేషన్ టైగర్..

న్యూఢిల్లీ, జూన్ 17, ప్రాంతీయ పార్టీల దూకుడుకు మరింతగా బ్రేకులు వేయాలని భావిస్తున్నారా? అంటే .. తాజాగా జరుగుతున్న పరిణామాలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఇటీవల ఎన్నికలు జరిగిన.. ఐదు రాష్ట్రాల్లో కీలకమైన తమిళనాడు, పశ్చిమబెంగాల్లలో ప్రభుత్వ పార్టీలు ఓడిపోయాయి. ఈ క్రమంలో బెంగాల్లో బీజేపీ సర్కారు ఏర్పడింది.దీంతో బెంగాల్లో 80 స్థానాలు దక్కించుకున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నందిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. దీని వెనుక బీజేపీ మంత్రాంగం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇక, తమిళనాడులోనూ ఇదే తరహా వ్యూహాత్మక సన్నివేశాలు ఖాయమని అంచనా వేస్తున్న డీఎంకే .. జాగ్రత్తలు తీసుకుంటోంది. ఉన్న 57 మంది ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకుంటోంది. ఇలా.. పలు రాష్ట్రాల్లో బీజేపీ దెబ్బకు ప్రాంతీయ పార్టీలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయని.. జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది.మరోవైపు.. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పట్టు మరింత బిగించే ప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికలకు ముందు.. బలైమన శివసేన పార్టీని చీల్చిన విషయం తెలిసిందే. ఈ పార్టీ కీలక నాయకుడిగా ఉన్న ఏక్నాథ్ షిండేతో తిరుగుబాటు జెండా ఎగరేయించి.. శివసేనను ముక్కలు చేశారు. ఆ తర్వాత.. బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇక, వచ్చే ఎన్నికలకు సంబంధించి.. ఇప్పటి నుంచే ఆపరేషన్ టైగర్ పేరుతో శివసేనను మరింత వీక్ చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది.చీలిపోయిన శివసేనకు సంబంధించి ఉద్ధవ్ థాక్రే నివాసంలో శివసేన నేతల భేటీ ఆదివారం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి ముగ్గురు ఎంపీలు దూరంగా ఉండడం.. వారు బీజేపీ వైపు దృష్టి పెట్టడం వంటివి చర్చకు దారితీశాయి. బెంగాల్ మాదిరి ఆపరేషన్ టైగర్ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. అయితే.. శివసేన మాత్రం తమ నేతలందరూ తమతోనే ఉన్నారని ప్రకటించింది.కానీ, చిత్రంగా.. ఈ సమావేశానికి రాని ఎంపీలు? బీజేపీ నేత ఇంట్లో విందుకు హాజరు కావడం గమనార్హం. మరోవైపు.. ఇప్పటికే కోరలు ఊడిపోయి.. ఇబ్బందిలో ఉన్న శివసేన మాత్రం గాండ్రింపులు మానలేదు. మేం అధికారంలోకి వస్తే బీజేపీ ఉనికిలో ఉండదు. బీజేపీ నేతలు ఇళ్ల నుంచి కూడా బయటకు రాలేరు. అని ఆ పార్టీ నాయకుడు సంజయ్‌రౌత్ వ్యాఖ్యానించారు.

# ఓవర్ నైట్ లో కింగ్ మేకర్ అయిన ఎన్ సీపీఐ

న్యూఢిల్లీ, జూన్ 17, నిన్నటిదాకా ఓ చిన్న రాజకీయ పార్టీగా ఉన్న నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) ఇప్పుడు ఒక్కసారిగా భారత రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. తృణమూల్ కాంగ్రెస్‌లో చెలరేగిన తిరుగుబాటులో ఎన్‌సీపీఐ వార్తల్లో నిలిచింది. 2023 లెక్కల ప్రకారం రూ. 75 నగదు మాత్రమే ఉన్న ఈ పార్టీ ఇప్పుడు లోక్‌సభలో కింగ్‌మేకర్‌గా మారనుంది. బెంగాల్‌లో రాజకీయ సంక్షోభం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్‌లో చీలికలు ఏర్పడ్డాయి. 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఎన్‌సీపీఐలో విలీనం అవుతామని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇస్తామని ప్రకటించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల విలీనాన్ని స్పీకర్ ఆమోదిస్తే ఇప్పటి వరకు పెద్దగా రాజకీయ ప్రభావం లేని ఎన్‌సీపీఐ ఒక్కసారిగా లోక్‌సభలో ఐదో అతిపెద్ద పార్టీగా, ఎన్డీయేలో రెండో అతిపెద్ద భాగస్వామ్య పార్టీగా అవతరించే అవకాశం ఉంది. తిరుగుబాటు ఎంపీలంతా కలిసి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి సభలో తమకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. మూడింట రెండొంతుల మద్దతు కూడా తమకు ఉందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) 2023 జనవరిలో భారత ఎన్నికల సంఘం వద్ద నమోదయింది. ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం ఈ పార్టీ కార్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లా సంకరైల్ ప్రాంతంలో ఉంది. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక ప్రకారం పార్టీకి మొత్తం రూ. 1,13,075 విరాళాల రూపంలో వచ్చాయి. దాదాపు పార్టీ మొత్తం నిధులు ఖర్చు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పార్టీ ఖజానాలో కేవలం రూ. 75 మాత్రమే మిగిలిందని ప్రకటించింది. 2023లో త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి పార్టీ ఖర్చుల్లో దాదాపు రూ. 49,400ను వినియోగించింది. ఇది పార్టీ తొలి ఎన్నికల ప్రయత్నాల్లో ఒకటిగా చెబుతున్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు షెఫ్లీ కుందు రూ. 15 వేల విరాళం ఇవ్వగా, ఉపాధ్యక్షుడు ఉత్తియా కుందు రూ. 18 వేల విరాళం అందించారు. 2023 – 24, 2024 – 25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విరాళాలు, ఆడిట్ నివేదికలు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రస్తుతం అందుబాటులో లేవు. మొత్తానికి రూ. 75 నగదుతో ఉన్న చిన్న పార్టీ ఇప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం ఆసక్తికరంగా మారింది.

# దేవాలయాల్లో దొంగలు పడ్డారు

చెన్నై, జూన్ 17, తమిళనాడులో మన దేశంలోనే ఎక్కువగా ఆలయాలు ఉంటాయి. దీనిని టెంపుల్ స్టేట్ అని పిలుస్తుంటారు. రామేశ్వరాలయం నుంచి మొదలుపెడితే మీనాక్షి వరకు విశిష్టమైన ఆలయాలు తమిళనాడులో ఉంటాయి. ఇక్కడ ఆలయాలు వందల ఎకరాలలో ఉంటాయి. పైగా ఆలయ పరిసర ప్రాంతాల్లోనే వాణిజ్యసముదాయాలు.. ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేశారు.. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వం తీసుకుంటుంది. తమిళనాడులో ఆలయాల ఆస్తుల మీద ప్రభుత్వానికి మాత్రమే హక్కు ఉంటుంది. ఇంతటి స్థాయిలో ఆస్తులు ఉన్నప్పటికీ ఆశించిన విధంగా ఆదాయం రావడం లేదు. ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలో ఉన్న పార్టీ నాయకులు అడ్డగోలుగా దోచుకోవడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తులకు ఆ వాణిజ్య సముదాయాలను అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. దేవస్థానాలకు కాకుండా .. తమ సొంత జేబుల్లోకి ఆ ఆదాయాన్ని మళ్లించుకున్నారు. ఫలితంగా గడిచిన కొన్ని సంవత్సరాలుగా దాదాపు 60 వేల కోట్ల ఆదాయం పక్కదారి పట్టింది. వాస్తవానికి వేలకోట్ల ఆదాయం వందల కోట్లకు పడిపోయింది. ప్రభుత్వ పెద్దలకు ఇందులో పాత్ర ఉండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేకపోయారు. ఇటీవల తమిళనాడులో ఒక వ్యక్తి ఈ వ్యవహారాన్ని సమాచార హక్కు ద్వారా బయటికి తీసుకొచ్చాడు. అంతేకాదు కోర్టు దాక కూడా వెళ్ళాడు. దీనిపై కేసు విచారణలో ఉంది. ఒకవేళ కేసు విచారణకు వస్తే తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా దోషిగా నిలబడుతుంది. ఒకవేళ కోర్టు ఆ డబ్బు మొత్తం చెల్లించాలని చెప్పినప్పటికీ ఎవరు చెల్లిస్తారు.. ఆ డబ్బు చెల్లించడానికి ఎవరు ముందుకు వస్తారు.. అన్నాడిఎంకె.. డీఎంకే ద్రావిడ వాదాన్ని తలకెత్తుకున్నాయి. కానీ ఓ వర్గాలను మెప్పించడానికి హిందువులను తొక్కేశాయి. అంతేకాదు, దేవాలయ ఆస్తులను కూడా ఆక్రమించాయి. ఓ నివేదిక ప్రకారం తమిళనాడులో చాలావరకు ఆలయాలలో ఆస్తులు అన్యాక్రాంతం అయిపోయాయి. ఇందులో డీఎంకే.. అన్న డీఎంకే పార్టీ నేతల హస్తముంది ఇప్పుడు టీవీకి నేతలు కూడా అదే పని చేస్తారు. అలాంటప్పుడు ఈ దుర్మార్గుల భరతాన్ని ఎవరు బయటపెడతారు.. సాక్షాత్తు ఆ దేవుడే దిగి వస్తే తప్ప ఈ ఆక్రమాలకు పాల్పడిన దుర్మార్గుల అసలు రంగు బయటపడదు.

# టాలీవుడ్ కు యదేచ్ఛగా డ్రగ్స్...

హైదరాబాద్, జూన్ 17, తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈగల్ ఫోర్స్ మరో కీలక ఆపరేషన్ నిర్వహించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఒకేసారి ప్రత్యేక దాడులు చేపట్టిన అధికారులు డ్రగ్స్, గంజాయి వినియోగిస్తున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను బలహీనపరచడంతో పాటు డిమాండ్‌ను తగ్గించడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన వారిలో 14 మందికి గంజాయి వినియోగించినట్లు పరీక్షల్లో నిర్ధారణ కాగా, మరో వ్యక్తికి గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాల వినియోగం కూడా పాజిటివ్‌గా తేలింది. విచారణలో భాగంగా అందరూ డ్రగ్స్ వినియోగించిన విషయాన్ని అంగీకరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. అనంతరం వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి డీ–అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు వెల్లడించింది. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతంలో హాస్టల్‌ను కేంద్రంగా చేసుకుని ఓ ముఠా కొకైన్, ఎండీఎంఏ, ఎల్‌ఎస్డీ, హ్యాష్ ఆయిల్ వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ గుర్తించింది. బెంగళూరు, గోవా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా జరుగుతున్నట్లు సాంకేతిక విశ్లేషణలో తేలిందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ మాదకద్రవ్యాలను సినీ పరిశ్రమకు చెందిన కొంతమందికి కూడా విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. టెక్నికల్ అనాలిసిస్ ద్వారా మొత్తం 44 మంది డ్రగ్స్ వినియోగదారులను అధికారులు గుర్తించారు. వీరిలో హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రధాన డ్రగ్ పెడ్లర్లు నగరంలో అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులపై దృష్టి సారించి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు ఈగల్ ఫోర్స్ పేర్కొంది. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంతో దాడులు నిర్వహించినట్లు తెలిపింది. విచారణలో మరో కీలక అంశం బయటపడింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డి పేర్లపై ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ. 3.13 లక్షలకు పైగా బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. చక్రపాణి, హర్షిత్ రెడ్డి ఇప్పటికే 2019లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయిన నిందితులేనని పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు దర్యాప్తును మరింత విస్తరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# మెట్రో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

హైదరాబాద్, జూన్ 17, హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేపట్టే క్రమంలో కొన్ని పాత నిర్మాణాలకు మార్పులు చేర్పులు చేయడం అనివార్యమవుతోంది. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ జంక్షన్‌లో పాదచారుల భద్రత కోసం నిర్మించిన ప్రతిష్టాత్మక ఉప్పల్ స్కైవాక్‌కు ఇప్పుడు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో గండం ఎదురైంది. కారిడార్‌కు సంబంధించిన భారీ పిల్లర్ల నిర్మాణానికి స్కైవాక్ అడ్డుగా మారడంతో.. దాన్ని ఒక వైపు తాత్కాలికంగా ముక్కలుగా తొలగించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. గతంలో ఉప్పల్ క్రాస్‌రోడ్డు దాటాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీనికి పరిష్కారంగా 2020లో రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో 660 మీటర్ల పొడవు, 34 మీటర్ల వెడల్పుతో 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, 6 మెట్ల మార్గాలతో ఈ స్కైవాక్ పనులు ప్రారంభించి 2023లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. భూమి నుంచి 6 మీటర్ల క్లియరెన్స్ ఉండే ఈ స్కైవాక్ పాదచారులకు ఎంతో సౌకర్యంగా మారింది. అయితే, తాజాగా ఉప్పల్ రింగురోడ్డు మీదుగా నిర్మిస్తున్న కొత్త ఎలివేటెడ్ కారిడార్ ఈ స్కైవాక్‌తో పాటు దానిపై నుంచి వెళ్లే మెట్రో రైలు లైన్‌ను కూడా దాటాల్సి ఉంది. అందువల్ల ఈ కారిడార్‌ను భూమి నుంచి గరిష్ఠంగా 23 మీటర్ల ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారుఇంత భారీ ఎత్తున ఉండే ఫ్లై ఓవర్‌ను మోయడానికి ఉప్పల్ జంక్షన్ వద్ద భారీ పిల్లర్లను నిర్మించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వరంగల్ జాతీయ రహదారి వైపు వెళ్లే స్కైవాక్ పిల్లర్ నంబర్ 23 ఏ నుంచి 24 వరకు ఉన్న దాదాపు 17 మీటర్ల మేర స్కైవాక్ భాగాన్ని తక్షణమే తొలగించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ తొలగింపు పనులు, పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ స్కైవాక్‌ను యథావిధిగా అమర్చడానికి అయ్యే అంచనా వ్యయాన్ని లెక్కించే బాధ్యతను ఒక ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించారు. దీనిపై క్షేత్రస్థాయి అధ్యయనం కోసం కన్సల్టెన్సీ ప్రతినిధులు మంగళవారం ఉప్పల్‌కు రానున్నారు. ఈ నిర్మాణాల కారణంగా రానున్న కొన్ని నెలల పాటు వరంగల్ రహదారి వైపు ఉన్న స్కైవాక్ మార్గాన్ని పూర్తిగా మూసివేయనున్నారు. దీనివల్ల కాలినడకన ప్రయాణించే వారికి కొన్ని ఇబ్బందులు తప్పవు. కాగా.. ఈ తాత్కాలిక తొలగింపు, పునర్నిర్మాణ ప్రక్రియకు అయ్యే పూర్తి ఖర్చును మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భరించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# మెట్రో లో బ్లేమ్ గేమ్

హైదరాబాద్, జూన్ 17, హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేయాల్సిన మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణ ప్రాజెక్టు ఇప్పుడు తీవ్రమైన ాజకీయ చదరంగంలో చిక్కుకుంది. కేవలం మౌలిక వసతుల ప్రాజెక్టుగా సాగాల్సిన మెట్రో వ్యవహారం కాస్తా, ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య పరస్పర రాజకీయ యుద్ధానికి దారితీసింది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మొదటి దశ మెట్రోను దాదాపు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ముగిసిందని, జపాన్ ఆర్థిక సాయంతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తక్కువ వడ్డీకి రూ. 13,600 కోట్ల రుణం లైన్ క్లియర్ అయిందని భావిస్తున్న తరుణంలో కేంద్రం నుంచి బ్రేకులు పడ్డాయనే వార్త ఒక్కసారిగా దుమారం రేపింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ సంస్థ మొదటి దశలో భారీ నష్టాలు రావడంతో రెండో దశ 122 కిలోమీటర్ల విస్తరణను చేపట్టేందుకు నిరాకరించిందని తెలిపారు. కేంద్రం సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం రూ. 30,000 కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ. 15,000 కోట్లకు కొనుగోలు చేయడానికి సిద్ధపడిందని, జపాన్ సంస్థ నుంచి వచ్చిన రూ. 13,600 కోట్ల రుణాన్ని ఐఆర్‌ఎఫ్సీ ద్వారా కేవలం 4 శాతం వడ్డీకే రీఫైనాన్స్ చేయడానికి అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్ర వాటాగా రూ. 1,400 కోట్లు కూడా చెల్లించామన్నారు. అయితే, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి రాజకీయ కారణాలతో, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ నిధుల బదిలీని అడ్డుకున్నారని రేవంత్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కిషన్ రెడ్డి పగలు బీజేపీలో, రాత్రి వేళ బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ కలిసి కుట్ర చేస్తున్నాయంటూ రేవంత్ రెడ్డి కొత్త కథలు అల్లుతున్నారని విమర్శించారు. ఈ ముక్కోణపు రాజకీయ యుద్ధం మధ్య నలిగిపోతున్నది మాత్రం సగటు హైదరాబాద్ పౌరుడే. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, చాంద్రాయణగుట్ట, నాగోల్ కారిడార్లను అనుసంధానిస్తూ ప్రతిపాదించిన 122 కిలోమీటర్ల భారీ విస్తరణ ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఎల్ అండ్ టీ నుంచి మొదటి దశ మెట్రో ఆస్తుల బదిలీ, రుణాల టేకోవర్ సవ్యంగా సాగితేనే రెండో దశకు అంతర్జాతీయ బ్యాంకుల నుంచి నిధులు సమకూరుతాయి. ఇప్పుడు ఐఆర్‌ఎఫ్సీ లోన్ క్లియరెన్స్ పెండింగ్‌లో పడటం ప్రాజెక్టు టైమ్‌లైన్‌ను దెబ్బతీస్తుంది. టెక్నికల్ కారణాల కంటే ఇక్కడ ఇగోలు, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువైపోయాయి. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోతే మెట్రో వంటి మెగా ప్రాజెక్టులు ముందుకు పడవు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు ట్రాఫిక్ కష్టాలు తీరాలన్నా, రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు రావాలన్నా మెట్రో ఫేజ్–2 అత్యంత కీలకం. దేశంలోని అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, వైజాగ్ వంటి నగరాలకు మెట్రో నిధులు వస్తున్నప్పుడు హైదరాబాద్‌కు ఎందుకు ఆలస్యం అవుతుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనలో కొంత నిజం ఉన్నప్పటికీ.. కేవలం ఢిల్లీపై నిందలు వేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ కూర్చుని, కేంద్ర అధికారులతో మాట్లాడి ఈ రూ. 13,600 కోట్ల లోన్ క్లియరెన్స్‌ను సాధించడమే నగరానికి శ్రేయస్కరమని లేదంటే 'మెట్రో విస్తరణ' కేవలం కాగితాలకే పరిమితమై, గాల్లో దీపంలా మారే ప్రమాదం ఉందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ కేంద్రానికి ఇష్టం లేకపోతే ఎన్‌ఓసీ ఇస్తే రాష్ట్రమే పూర్తి భారాన్ని మోస్తుందని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అంతే తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 కు వ్యతిరేకం కాదని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇప్పటికే దీనికి సూత్రప్రాయ ఆమోదం తెలిపారని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం నిధులు కేంద్రమే ఇవ్వబోతోందని, ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసేటప్పుడు సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. తనపై రేవంత్ రెడ్డి చేస్తున్నవన్నీ అభూతకల్పనలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం చెందిందని, ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించడానికే ఈ మెట్రో డ్రామా ఆడుతున్నారని రివర్స్ అటాక్ చేశారు. సీనియర్ జర్నలిస్టులతో కమిటీ వేసి నిజాలు నిరూపిస్తే తాను రాజీనామాకైనా సిద్ధమని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ వివాదంలోకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు కూడా ఎంట్రీ ఇచ్చారు. మెట్రో ప్రాజెక్టు ఆలస్యానికి, రుణాల నిలిపివేతకు రేవంత్ రెడ్డి పరిపాలనా అసమర్థతే కారణమని ఆయన విమర్శిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే మెట్రో మొదటి దశను విజయవంతంగా పూర్తి చేశామని, తాము సిద్ధం చేసిన ఫేజ్–2 రూట్ మ్యాప్‌లను మార్చడం వల్లే ప్రాజెక్ట్ గందరగోళంలో పడిందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్‌ఎస్, బీజేపీలు

# కాంగ్రెస్ లో కోల్డ్ వార్...

హైదరాబాద్, జూన్ 17, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన తరుణంలో.. కీలక నేతల మధ్య అభిప్రాయ బేధాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యల దుమారం పూర్తిగా చల్లారకముందే.. తాజాగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన 'హిట్లర్' వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేయడం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.. పీసీసీ చీఫ్ క్లారిటీ ఇటీవల ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్‌కు ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. గతంలో బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాలనలో కొన్నిసార్లు హిట్లర్ లాంటి కఠిన నిర్ణయాలు కూడా అవసరమనే కోణంలో వ్యాఖ్యానించారు. దీనిపై యాంకర్ ప్రశ్నించగా పీసీసీ చీఫ్ ఏమాత్రం సంకోచించకుండా తన అసంతృప్తిని బయటపెట్టారు. "సీఎం రేవంత్ రెడ్డి చేసిన హిట్లర్ వ్యాఖ్యలతో నేను ఏకీభవించను. అది పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. హిట్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒక క్రూరమైన నియంతగా.. విలన్‌గా భావిస్తారు. అలాంటి వ్యక్తిని ఎవరూ ఆదర్శంగా తీసుకోలేరు.. ఆయన చర్యలను సమర్థించలేం" అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అంతేకాదు ఈ అంశంపై ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టాన వర్గాల్లో కూడా అంతర్గతంగా చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించడం విశేషం. గాంధీ సిద్ధాంతాలను నమ్మే కాంగ్రెస్ పార్టీలో ఇలా నియంతల ప్రస్తావన రావడం సరికాదనే భావన ఆయన మాటల్లో వ్యక్తమైంది. హైడ్రా చర్యలపై కీలక వ్యాఖ్యలు ఇదే ఇంటర్వ్యూలో హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా పనితీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నగరంలో చెరువుల పరిరక్షణకు.. అక్రమ నిర్మాణాల తొలగింపునకు హైడ్రా చర్యలు అవసరమేనని ఆయన అంగీకరించారు. అయితే అదే సమయంలో బాధితుల పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు. హైడ్రా చర్యల వల్ల పేదలకు లేదా ఎవరికైనా అన్యాయం జరిగిందని తన వద్దకు వస్తే, వారికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అధికారుల తొందరపాటు చర్యల వల్ల తప్పులు జరిగి ఉండవచ్చని.. అలాంటి వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారుప్రతిపక్షాల విమర్శలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి లాంటి పీసీసీ చీఫ్ బహిరంగంగా స్పందించడం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీనిని ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ నేతలు అస్త్రంగా మార్చుకున్నారు. "ముఖ్యమంత్రి వైఖరి పార్టీ నేతలకే నచ్చడం లేదనడానికి ఇదే నిదర్శనం" అని గులాబీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో తనపై వచ్చిన నెగెటివ్ కథనాల వెనుక కాంగ్రెస్ పార్టీలోని కొందరు కీలక నేతల హస్తం ఉందనే అనుమానంతో పీసీసీ చీఫ్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఆయన కొందరు ముఖ్య నేతలతో కాస్త దూరంగానే ఉంటున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మొత్తానికి షబ్బీర్ అలీ వ్యాఖ్యల వివాదం.. పీసీసీ చీఫ్‌పై మీడియా కథనాలు.. ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ ఓపెన్ స్టేట్‌మెంట్స్.. ఇవన్నీ తెలంగాణ కాంగ్రెస్‌లో 'కోల్డ్ వార్' నడుస్తోందనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ మలుపులు తిరుగుతాయో చూడాలి

## సోలార్ ప్యానెల్స్ తో జలమండలి

హైదరాబాద్, జూన్ 17, జలమండలికి పెరుగుతున్న విద్యుత్ వినియోగం, అదే స్థాయిలో అందుతున్న భారీ కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడానికి సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపట్టాలని నిర్ణయించుకోగా, తాజాగా దీనికి కార్యాచరణ సిద్ధమైంది. మొదటి దశలో భాగంగా మల్లారం, పెద్దాపూర్, కొండపాక ప్రాంతాల్లో రూ. 383 కోట్ల వ్యయంతో భారీ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా 67.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలోనే ఈ పనుల కోసం టెండర్లు పిలవడానికి వాటర్ బోర్డు సిద్ధమైంది. నగరానికి సరఫరా చేస్తున్న నీటిలో కృష్ణా, గోదావరి నదుల నుంచి ఎత్తిపోతల ద్వారా వస్తున్న నీరే కీలకం. మంజీర జలాలు కూడా పాక్షికంగా ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉండటంతో, జలమండలికి భారీగా విద్యుత్ అవసరమవుతోంది. ప్రస్తుతం జలమండలి నెలకు రూ. 120 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను చెల్లిస్తోంది. జలమండలికి అనేక ప్రాంతాల్లో సొంత ఖాళీ స్థలాలు ఉండటమే కాకుండా, పలుచోట్ల భారీ రిజర్వాయర్లు ఉండటం వల్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి.

# రాములమ్మ దారెటు..




మెదక్, జూన్ 17, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పుడు 'రాములమ్మ' రూట్ మార్చబోతున్నారా? పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పదవిపై ఆమె అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నాయి గాంధీ భవన్ వర్గాలు. ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరిన సీనియర్ నేత, సినీ నటి విజయశాంతి.. ప్రస్తుతం పార్టీ వ్యవహారాలకు కాస్త దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. పదవులు ఉన్నా లేకపోయినా తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించే విజయశాంతి, ఇప్పుడు కాంగ్రెస్ తీరుపై కొంత అసహనంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది ఇటీవల ఆమెకు కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. అసలు సీనియర్ల లిస్టులోనే లేని ఆమె పేరు తెరపైకి రావడం, నేరుగా ఢిల్లీ స్థాయిలోనే లాబీయింగ్ చేసి పదవి దక్కించుకోవడం అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. అయితే, ఈ ఎమ్మెల్సీ పదవిపై రాములమ్మ అస్సలు హ్యాపీగా లేరన్నది ఇన్‌సైడ్ టాక్. తన సీనియారిటీకి, ఇమేజ్‌కు కేవలం శాసనమండలి సభ్యురాలిగా ఉండటం సరిపోదని, తన అసలు రేంజ్ మంత్రి పదవి అని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అసంతృప్తి కారణంగానే విజయశాంతి పార్టీ అధికారిక కార్యక్రమాలకు పెద్దగా హాజరుకావడం లేదని తెలుస్తోంది. కేవలం శాసనమండలి సమావేశాలకు మాత్రమే వస్తూ, అదీ మొక్కుబడిగా ప్రశ్నలు వేసి వెళ్ళిపోతున్నారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. పైగా, మొన్నటి మొన్న జరిగిన మండలి సమావేశాల్లో సొంత ప్రభుత్వంపైనే ఆమె కొన్ని ఘాటు వ్యాఖ్యలు చేయడం, పరోక్షంగా తన అక్కసును వెళ్లగక్కడం కాంగ్రెస్ శ్రేణులను విస్మయానికి గురిచేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే రాములమ్మ కాంగ్రెస్‌కు ఏదో ఒక గట్టి అల్టిమేటం ఇవ్వబోతున్నారా అనే అనుమానాలు రాష్ట్రంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో, విజయశాంతి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇక్కడి స్థానిక నేతలతో సంబంధం లేకుండా, నేరుగా హైకమాండ్‌నే ఢిల్లీలో కలవాలని ఆమె డిసైడ్ అయినట్లు టాక్. ఇప్పటికే మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా, రాములమ్మ మాత్రం ఒక పక్కా ప్లాన్‌తో హస్తిన బాట పడుతున్నారట. తనకు కనుక మంత్రి పదవి ఇస్తే.. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ మైలేజ్‌కు ఎలాంటి వ్యూహాలతో ముందుకెళ్తానో వివరించడానికి విజయశాంతి ఒక ప్రత్యేక బ్లూ ప్రింట్ కూడా సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కాగా, గతంలో ఎవరూ ఊహించని విధంగా ఎమ్మెల్సీ పదవిని సొంతం చేసుకున్న రాములమ్మ, అదే జోష్‌తో ఇప్పుడు మంత్రి పదవిని కూడా సాధించుకుంటే ఆశ్చర్యపోనక్కర్లేదని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. మరి ఢిల్లీ పెద్దలు రాములమ్మ డిమాండ్‌కు తలొగ్గుతారా? లేదా అనేది రానున్న రోజుల్లో చూడాలి.

## సిద్ధి పేటలో హరీష్ రావును గద్దె దించే వరకు నిద్ర పోను

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



హైదరాబాద్ హరీష్ రావు, కేటిఆర్ లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు హాట్ కామెంట్స్ చేసారు. సిద్ధి పేటలో హరీష్ రావును గద్దె దించే వరకు నిద్ర పోను. అక్కడే ఇళు ్కట్టుకుని ఉంటా. పెద్దాయన కేసీఆర్ ఏజ్ అయిపోయింది. రిటైర్ మెంట్ స్టేజి వచ్చింది. మనకు టార్గెట్ హరీష్ రావు, కేటిఆర్ అని అన్నారు.

బుధవారం నాడు హనుమంతరావు గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పేరు లేకుండా హరీష్ రావు,కేటిఆర్ దుకాణం బంద్ చేయాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో పెట్రోల్ పోసి తగలబెట్టి, తెలంగాణ కోసం సచ్చిపోయారు అన్నారు. ఇప్పుడు ఈ కొడుకులు ఎంజాయ్ చేస్తున్నారు. సిద్ధి పేట,దుబ్బాక లో బీఆర్రెస్ నేతలు వద్ల లారీలను అడ్డుకున్నారు. ఒకప్పుడు హరీష్ రావు ప్యారాగాన్ చేప్పులతో వచ్చిండు. ఇప్పుడు 5స్టార్ హోటల్స్ వేల కోట్లు వచ్చాయని ప్రశ్నించారు.

హైదరాబాద్ లో కేటిఆర్, హరీష్ రావు లు లక్షల కోట్లకు ఎదిగి పోయారు. మునుగోడు ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ సారి సిద్ధి పేటలో బులెట్ దించాలి. సిద్దిపేట లో కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ లేక 26సంవత్సరాలు అవుతుంది. కేటిఆర్, హరీష్ రావు లు వందల కోట్లు సంపాదించారు. హరీష్ రావుకు, కేటిఆర్ కు 50 సోషల్ మీడియా లు ఉన్నాయి. అవసరం వచ్చినప్పుడు ఆంధ్రా, తెలంగాణ అని రెచ్చగొడుతారు. వాటి ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాటిని తిప్పి కొట్టాలని అన్నారు.

డబ్బులు పెట్టి సోషల్ మీడియా ను మెయింటెన్ చేస్తున్నారు. ఎన్నో కేసుల పాలు అయ్యాం. మీకోసం అడ్డంగా నిలబడటానికి నేను సిద్ధంగా ఉన్న. సుక్కలు చూపించడానికి నేను తయారు గా ఉన్న. కష్ట పడ్డ కార్యకర్తలను గెలిపించడానికి సిద్ధాం ఉన్నాం. కష్ట పడ్డ కార్యకర్తల ఎన్నికలకు 200 శాతం గుర్తింపు ఉంటుంది. రెండు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయి.కార్యకర్తల కోసం వచ్చే ఎన్నికలు. కార్యకర్తలు నారాజ్ కావొద్దు. మీకోసం మేము కష్ట పడతాం. కార్య కర్తలు అనవసరంగా ఇన్వాల్వ్ అయి సోషల్ మెడియా లో పోస్ట్ లు పెట్టొద్దు. మైనం పల్లి హనుమంత రావు మాజీ కావొచ్చు. కానీ కార్యకర్తలు మాజీలు కారు. గెలిచే వారికి టికెట్లు ఇస్తాం. సిద్దిపేట కు స్పెషల్ కోటా కింద నామినేటెడ్ పదవులు వుంటాయి. జెండా మోసిన కార్యకర్తలను మర్చిపోమని అన్నారు.

## అదుపు తప్పిన టిప్పర్..పోలీసుల అదుపులో డ్రైవర్

సికింద్రాబాద్ వారాసిగూడ ప్రధాన రహదారిపై టిప్పర్ బీభత్సం సృష్టించింది. జామై ఉస్మానియా నుండి చిలకలగూడ వైపుకు వెళుతున్న క్రమంలో వారాసిగూడ కౌసర్ మసీదు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న టిప్పర్ పాదచారుల పైకి దూసుకు వెళ్తుండగా పాదచారులు ఒక్కసారిగా పక్కకు తప్పుకోవడంతో పక్కనే ఉన్న భారీ వృక్షాన్ని ఢీ కొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో భారీ వృక్షం నేల కూలిపోగా, రహదారిపై వెళ్తున్న పాదచారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ వాహనాన్ని అతివేగంగా నడపడం మూలంగానే అదుపుతప్పి అతను చెట్టుకు ఢీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇళ్ల ఎదుట చిన్నారులు ఆడుకుంటున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురి అయ్యారు. వెంటనే టిప్పర్ డ్రైవర్ను పోలీసులకు అప్పగించడంతో పోలీసులు అతని అదుపులోకి తీసుకొని వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## డెంటల్ కాలేజ్ హాస్టల్ లో ర్యాగింగ్

హైదరాబాద్ కోఠి లోని మెడికల్ కాలేజీ హాస్టల్ లో బిడిఎస్ స్టూడెంట్స్ కూడా ఉంటున్నారు. గత ఆరు నెలలుగా బిడిఎస్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ ను ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ ర్యాగింగ్ చేస్తున్నారని ఉస్మానియా డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సర్జీవ్ సింగ్ యాదవ్ అన్నారు.

స్విగ్గీ ఆర్డర్స్ కిందకు వెళ్లి తీసుకురావాలని , కులర్ లో వాటర్ నింపాలని , గోడ కుర్చీ వెయిస్తూ వేధింపులకు గురిక్ చేస్తున్నారు. వద్దని వారించినా హౌస్ సర్జన్స్ పై కూడా దాడి చేశారు. ఒకసారి పిలిచి వార్నింగ్ ఇచ్చిన వారిలో మార్పు రాలేదు. అందుకోసమే బిడిఎస్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ 12 మందిపై సుల్తాన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి జరిగిన విషయం తెలిపి ఆరు నెలలు సస్పెండ్ కూడా చేశాం. ఉస్మానియా లో ర్యాగింగ్ కు తావులేదు. ర్యాగింగ్ కారణంగా ఎంతో మంది పిల్లలు చనిపోతున్నారు. అందుకోసమే వీరిపై ఈ చర్యలు తీసుకున్నాం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం. పోలీసుల రిపోర్ట్ వచ్చాక వీరిపై తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.

# జూలై 19 నుంచి బోనాలు

హైదరాబాద్, జూన్ 17, తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల పండగ కు అంతా సిద్ధం అయింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన ఈ ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది ఆషాఢమాస బోనాలు.. జూలై 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ ఉత్సవాలు అధికారికంగా మొదలు కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు హైదరాబాద్ నగరం మొత్తం జరగనున్న ఈ బోనాల పండగ.. ఆగస్ట్ 10వ తేదీ వరకు అంగరంగ వైభవంగా కొనసాగుతాయని తెలిపారు.ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19వ తేదీన చారిత్రక గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించనున్నారు. ఇక అదే రోజున హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఆదివారం, గురువారాల్లో అమ్మవారికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించనున్నారు.ఈ బోనాల ఉత్సవాల్లో అతి కీలక ఘట్టాలు ఆగస్ట్ తొలి వారంలో జరగనున్నాయి. ఆగస్ట్ 2వ తేదీ ఆదివారం రోజున లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారితోపాటు ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున బోనాలను సమర్పించనున్నారు. ఆగస్ట్ 3వ తేదీ సోమవారం రోజున సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో పవిత్ర రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ తర్వాత అంబారీపై అమ్మవారిని సాగనంపే ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టనున్నారు.గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభం కానున్న ఈ బోనాల జాతర.. ఆ తర్వాత లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు.. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో ముగియనుంది. ఆగస్ట్ 10వ తేదీన ఉమ్మడి దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపు.. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ సంవత్సరం ఆషాఢ బోనాల జాతర ముగియనుంది.ఇక రాష్ట్ర పండగ అయిన ఈ బోనాల పండుగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ సర్కార్ ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ సహా అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు, భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

# తెలంగాణ ఇజ్జత్ తీయడమే సీఎం రేవంత్ పని కవిత



గోదావరిఖని"బాయిబాట"లో భాగంగా గోదావరిఖని 11 ఇంక్లైన్ కార్మికులతో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గేట్ మీటింగ్ జరిపారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కవిత మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. అప్పులు పుడుతలేవంటాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫోన్ ఎత్తుత లేదని చెబుతాడు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడతడా? అందుకే మన రాష్ట్రంపై పెత్తనం కోసం పక్క రాష్ట్రం నాయకులు కుట్ర చేస్తున్నారు. సింగరేణిలో కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు వస్తే మమ్మల్ని అడ్డుకుంటున్నారు. కార్మికులకు కనీస అవసరాలు తీర్చకుండా ప్రభుత్వం, ఆఫీసర్లు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

సింగరేణిని కాపాడేందుకు బీజేపీ ఎక్కువ బొగ్గు బ్లాకులు కేటాయించాలి. అండర్ గ్రౌండ్ మైనింగ్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కార్మికుల హక్కుల కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుంది. కార్మికులను కలిసేందుకు వస్తే గేట్లు బంద్ పెట్టి అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలను సింగరేణి కార్మికులు కలవద్దా? కార్మికులకు ఏ పార్టీ వారితోనైనా మాట్లాడే హక్కు ఉంది. కానీ సింగరేణి యాజమాన్యం పోలీసులను తీసుకొచ్చి మమ్మల్ని అడ్డుకుంటున్నారని అన్నారు.

అసలు సింగరేణి క్యాంపస్ లోకి పోలీసులే రావద్దు. కానీ వాళ్లను తీసుకొచ్చారంటే వీళ్లు ఎంత తప్పు చేసి ఉంటారు? ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి, రాహుల్ గాంధీ కూడా ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులతో మీటింగ్ లు పెట్టలేదా? మీ మాటలు నమ్మి కోల్ బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ ను గెలిపించారు. కానీ మీరు గెలిచాక గ్లౌజ్ లు, షూస్, మెషీన్లు ఏదీ నాణ్యత లేకుండా అయిపోయింది. గనుల్లో కి వెళ్లే కార్మికులకు కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఏమైనా అడిగితే గత ప్రభుత్వం మీద నెట్టేసి డబ్బులు లేవు అంటున్నారు. సింగరేణి కార్మికులకు మాట ఇచ్చే ముందు ఇవ్వన్నీ మీకు తెలియవా? కనీసం నీళ్లు, గాలి ఇచ్చే సోయి కూడా లేదు. ప్రాథమిక సౌకర్యాలు కూడా ఇవ్వటం లేదు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావటంతోనే చిన్న చిన్న సౌకర్యాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వీటన్నింటినీ ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. నాది ప్రశ్నించే తత్వం. నేను 20 ఏళ్లుగా సింగరేణి కార్మికులతో కలిసి పనిచేస్తున్నా. తెలంగాణ ఉద్యమంలో అగ్గిరాజేసి రాష్ట్రం సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా కేసీఆర్ తో మాట్లాడి మీ కోసం పనిచేశా. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాల కోసం నేను చేసిన పోరాటంతో 19 వేల ఉద్యోగాలు నడుచుకుంటూ వచ్చాయి. మహిళలకు సింగరేణిలో ఉద్యోగాలు వచ్చేలా చేశాం. నేను ఎప్పటికీ సింగరేణి బిడ్డనే. ఎక్కడున్న కార్మికుల కోసమే కొట్లాడుతా. సింగరేణి కార్మికులను ఆఫీసర్లు ఇబ్బంది పెడుతుండటం చాలా బాధాకరం. ఆఫీసర్లకే తమ హక్కులు కాపాడుకునేందుకు యూనియన్లు ఉన్నాయి. అలాంటిది కార్మికులకు తమ హక్కులు కాపాడుకోవటానికి యూనియన్లు ఉండొద్దా? కార్మికులను ఇబ్బంది పెట్టవద్దని...చిన్న వాటికే మెమో లు అంటూ పరేషాన్ చేయవద్దని రిక్వెస్ట్ చేస్తున్నా. వన్ విజన్ అన్నట్లుగా ఉండాలి. కానీ ఇక్కడ రెండు విజన్లు అన్నట్లుగా పనిచేస్తున్నారు. మీ కారణంగా మైన్ లో కార్మికులు సంతోషంగా లేరు. ఆఫీసర్లు మానవీయకోణంలో ఆలోచించాలి. డిజీల్ కుంభకోణంలో పైన ఉన్న పెద్దవాళ్లు చిన్న ఆఫీసర్లను ఇబ్బంది పెడితే రియాజ్ గారు నేనే వాళ్ల హక్కుల కోసం పోరాటం చేశాం. కార్మికుల హక్కులు, వారికిచ్చే సౌకర్యాలు, భద్రత కోసం ఆఫీసర్లే తమ పై అధికారులతో కొట్లాడాలి. ఈ కాంగ్రెస్ పార్టీ వాళ్లు మనల్ని రానివ్వొద్దని ప్రయత్నం చేస్తున్నారు. కానీ తల్లి కాంగ్రెస్ తోనే పోరాటం చేసి...తెలంగాణను సాధించుకున్నాం. ఇప్పుడున్న ఈ పిల్ల కాంగ్రెస్ ఎంత? ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడు. ఢిల్లీకి అప్పు కోసం పోతే చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లను చూసినట్లు చూస్తున్నారని అంటాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోన్ ఎత్తటం లేదని చెబుతాడు. మొన్నటికీ మొన్న నేను హిట్లర్ లాంటి వాడినంటూ గొప్పగా చెప్పుకుంటున్నాడు. అసలు ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడుతాడా? ఆయన బేలా మాటల కారణంగానే ఆంధ్రాలో ఉండే నాయకులు మనపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు చేస్తే 11రోజులు అన్నం తినలేదన్న పవన్ కళ్యాణ్ మళ్లీ తెలంగాణలో రాజకీయాలు చేస్తాడంట. వాళ్లను మనం అడ్డుకుంటున్నామంట. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి, ఈ పవన్ కళ్యాణ్ వారంలో మూడు రోజులు హైదరాబాద్ లోనే ఉంటున్నారు. మన ముఖ్యమంత్రి బేలగా మాట్లాడుతుంటే పక్క రాష్ట్రం వాళ్లు పెత్తనం కోసం వస్తున్నారు. అందుకే మన సంపద మనం కాపాడుకునేందుకు మనమంతా మేలుకోవాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ సింగరేణికి కొత్త బ్లాక్ లు ఇవ్వాలి. ఈ రాష్ట్ర ప్రభుత్వం మూసుకుపోతున్న అండర్ గ్రౌండ్ మైనింగ్ ను తెరవాలని అన్నారు.

బొగ్గు బ్లాక్ లలో షాఫ్ట్ వేస్తే అవి ఇంకొక 50 ఏళ్ల వరకు నడుస్తాయి. ఓపెన్ కాస్ట్ మైనింగ్ అంటే కుదరదు. అండర్ గ్రౌండ్ మైనింగ్ చేయాల్సిందే. అండర్ గ్రౌండ్ మైనింగ్ కారణంగా పర్యావరణ పరిరక్షణతో పాటు వేలాది మందికి ఉపాధి దొరుకుతుంది. సింగరేణి కార్మికులకు కష్టాలపై మాట్లాడాల్సిన ఏఐటీయూసీ మౌనంగా ఉంది. సింగరేణి డబ్బులతో నిర్మించిన మెడికల్ కాలేజ్ లో 25 శాతం సీట్లు కార్మికుల పిల్లలకు ఇవ్వాలి. కానీ ఐదు శాతం కూడా ఇవ్వటం లేదు. దీనిపై ఏఐటీయూసీ నేతలు మాట్లాడటం లేదు. సింగరేణి కార్మికుల పిల్లలు చదువు కునేందుకు మంచి స్కూల్స్ ఏర్పాటు చేయాలి. సింగరేణిని కాపాడటమే మా ప్రథమ కర్తవ్యం. మా ట్రేడ్ యూనియన్ హెచ్ఎంఎస్. రకరకాల కారణాలతో నేను కొత్తగా పార్టీ పెట్టాల్సి వచ్చింది. మా పార్టీకి మీ ఆశీర్వాదం కావాలని బాయిబాట కార్యక్రమం ద్వారా ఇక్కడకు వచ్చాను. నేను కష్టాల్లో ఉన్నప్పుడు మీ మద్దతు కావాలని వచ్చాను. మీరు కష్టంలో ఉన్నప్పుడు నేను మీకోసం పోరాటం చేస్తాను. మిమ్మల్ని ఆఫీసర్లు ఇబ్బంది పెడితే ఒక్క ఫోన్ చేయండి. మేము వచ్చి మీకోసం పోరాటం చేస్తామని అన్నారు.

## ఛీటింగ్ కేసులో కిలేడీ అరెస్టు

హైదరాబాద్ బంజారాహిల్స్ లో అధిక వడ్డీల ఆశ చూపి కోట్లాది రూపాయలు వసూలు కేసులో ఏడాది నుంచి పరారీలో ఉన్న కిలాడీ లేడీ శ్రీలక్ష్మి అరెస్ట్ అయింది. నందినగర్ పరిసర ప్రాంతాల్లో బాధితులు. రూ 2 కోట్లదాకా వసూలు చేసి శ్రీలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్ పరారయ్యారు. ఏడాది క్రితం బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదయింది. బాధితుల సంఖ్య ఎక్కువ కావడంతో సీ సి ఎస్ కు కేసు బదిలీ అయింది. శ్రీలక్ష్మిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్ కు తరలించారు.

## కాజ ఈస్ట్ లేక్ పార్క్ ను ప్రారంభించిన మంత్రి లోకేష్

### రూ.3.3 కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణం




మంగళగిరి: మంగళగిరి మండలం కాజ గ్రామంలోని ఉప్పలపాడు-నంబూరు-కాజ రోడ్డు మార్గంలో ఆధునిక హంగులతో నిర్మించిన కాజ ఈస్ట్ లేక్ పార్క్ ను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా కాజ లేక్ పార్క్ కు చేరుకున్న మంత్రి లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్ లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కాజ ఈస్ట్ లేక్ పార్క్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పార్క్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కను నాటారు. అనంతరం పార్క్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. సెల్ఫీ తీసుకున్నారు. రూ.3.3 కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణంమంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా కాజ గ్రామంలో ఈస్ట్ లేక్ పార్క్ ను నిర్మించారు. సెల్ కాన్ సంస్థ రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పార్క్ను అభివృద్ధి చేయడం జరిగింది. 17.18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక హంగులతో పార్క్ను తీర్చిదిద్దారు. ఇప్పటికే ఉన్న చెరువు కట్టను 1.7 కిలోమీటర్ల మేర బలోపేతం చేశారు. పార్క్లో 42 రకాల జాతులకు చెందిన మొత్తం 12,800 మొక్కలను నాటారు. 1.7 కిలోమీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, భద్రత కోసం ట్రాక్ కు ఇరువైపులా జీఐ చైన్- లింక్ మెష్ ఫెన్సింగ్, ఆధునిక సుందరీకరణ పనులు చేపట్టి పార్క్ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింక్ ట్రాక్ వెంట విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, మంగళగిరి ఏఎంసీ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చందు, ఏపీ సివిల్ సప్లైస్ కార్పోరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్యతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు.

## ఉస్మానియా డెంటల్ కాలేజీ హాస్టల్ లో ర్యాగింగ్

### పన్నెండు మందిపై కేసులు



హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. బీడీఎస్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారనే ఆరోపణలపై ఫైనల్ ఇయర్కు చెందిన 12మంది విద్యార్థులపై కేసు నమోదైంది. కాలేజ్ ప్రిన్సిపల్ సంజీవ్సంగ్ యాదవ్ ఫిర్యాదు మేరకు సుల్తాన్బజార్ పోలీసులు ుఉ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. కాలేజ్ యాజమాన్యం ర్యాగింగ్కు పాల్పడిన స్టూడెంటు 6నెలల పాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు, ఈ 12 మంది కాక ఇంకెవరి హస్తమైనా ఉందా అనే విషయం లోతు గా ఆరా తీస్తున్నారు

### షబ్బీర్ ఆలీకి మద్దతుగా ప్లేక్సీలు

హైదరాబాద్ గాంధీభవన్ లో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కి మద్దతుగా ఫ్లెక్సీ లు వెలిసాయి. ముస్లిం లకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన ఛాంపియన్ షబ్బీర్ అలీ. నిజం ఎప్పటికీ మరుగున పడదు. నిజమైన నాయకుడిని ఎవరూ తక్కువ చేయలేరు . పార్టీ లో నిబద్ధత గల నాయకుడు, మహిళలను గౌరవించే నాయకుడు, లాయలిస్ట్ . నిజాలు ఎప్పటికైనా రివిల్ అవుతాయాంటూ గాంధీభవన్ లో ఫ్లెక్సీలలో పేర్కొన్నారు..

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ ను పరామర్శించిన పవన్ కళ్యాణ్

**జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్**

**అభిమాని కోరికను గౌరవించి ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి**

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..**

**వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం**

**నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత**

**వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి**









జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ ని కలవాలని అభిలషించాడు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, మతి మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు. ఇంట్లోకి వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ ని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు. కుటుంబ జీవనోపాధికి క్యాంటీన్ ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ గారు నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రంలో పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య

### ఎన్నిరోజులైనా పంట కొనుగోలు చేయకపోవడంతో రైతు ఆత్మహత్య




ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి నుగూరే పాండురంగ్(48) అనే రైతు తీసుకువెళ్లాడు. హమాలీలకు డబ్బులు చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేసారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, పది రోజులైనా జొన్నలు లోడ్ చేయలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## నాలాలలో పూడికతీత పనులు

### వెంటనే ప్రారంభించాలి

నాచారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం, హెచ్ఎంటి డివిజన్ లలో నాళాలలో పూడుకతీత పనులను తక్షణమే చేపట్టి నాలలకు గోడలు ఫెన్సింగ్ లేని చోట తక్షణమే రక్షణ కొరకు గోడలు ఏర్పాటు చేయాలని మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ రాగిరి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నాచారంలోని అంబెద్కర్ నగర్ లోని అంబెద్కర్ విగ్రహం , భవాని నగర్ లోని నాలాల వద్ద రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే నాళాల పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. నాలాల వద్ద ఎటువంటి రక్షణ లేకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలకు ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. అలాగే నాచారం, హెచ్ఎంటి డివిజన్ ల ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకొని నాలాల వద్ద ఫెన్సింగ్, గొడలను ఏర్పాటు చేయాలని అన్నారు. వారం రోజులలో నాలల పూడికతీత పనులను చేపట్టకపోతే తార్నాకలోని మల్కాజ్గిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

## మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

మహబూబాబాద్ బుధవారం నాడు మహబూబాబాద్ లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాలేరు లింక్ కెనాల్ సర్వే పనులను గిరిజనులు అడ్డుకున్నారు. చావనైనా చస్తాము తప్ప మా భూములను వదులుకోబోమని హెచ్చరించారు. గార్ల మండలం దుబ్బగూడెం సమీపంలో మున్నేరు వాగు పై ప్రభుత్వం నిర్మించనున్న పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్ట్ సర్వే పనులను అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు ఒప్పుకునేది లేదని ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోడ్డు పై బుద్దారం గిరిజనులు భైఠాయిఇంచారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

# మర్పల్లి మన ఊరు మన బాధ్యత కార్యక్రమం ప్రారంభించిన సర్పంచ్ మధు గు రామేశ్వర్ పాల్గొన్న జనం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి గ్రామంలో సర్పంచ్ మదుగు రామేశ్వర్ గారు చేపట్టిన "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఒక అద్భుతమైన, సమగ్రమైన వార్తా..

మర్పల్లి అభివృద్ధి ధ్యేయంగా

"మన ఊరు – మన బాధ్యత": ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్న సర్పంచ్ మదుగు రామేశ్వర్ మర్పల్లి గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు స్థానిక సర్పంచ్ శ్రీ మదుగు రామేశ్వర్ గారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమం బుధవారం గ్రామంలో ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ గారు స్వయంగా వార్డులలో పర్యటిస్తూ, ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల ముంగిట సర్పంచ్ వెల్లువెత్తిన సమస్యలు:

ఈ పర్యటనలో భాగంగా గ్రామస్థులు సర్పంచ్ గారి దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్లు, స్పౌస్ (భార్యాభర్తల) పింఛన్ల మంజూరుతో పాటు, వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరారు. ప్రజల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ రామేశ్వర్ గారు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లు – కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక నిఘా:

రాబోయేది వర్షాకాలం కావడంతో ప్రజల రక్షణే ధ్యేయంగా సర్పంచ్ గారు పలు కీలక సూచనలు చేశారు. ప్రమాదకరంగా మారిన పాత, పురాతన ఇళ్లలో ఎవరూ నివసించవద్దని ఆయన కోరారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమని, అవసరమైతే ఆ పాత ఇళ్లను కూల్చివేసి, వారి స్థానంలో కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తామని ప్రజలకు ధైర్యం చెప్పారు. మన గౌరవ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి సహకారంతో మర్పల్లి గ్రామానికి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను తీసుకొచ్చి, పేద ప్రజలందరికీ సొంతింటి కల నెరవేరుస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం:

తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూశానని రామేశ్వర్ గారు పేర్కొన్నారు. ఎక్కడ బోర్ చెడిపోయినా, మోటార్ పాడైనా అధికారుల కోసం ఎదురుచూడకుండా.. తన సొంత డబ్బులతో తక్షణమే కొత్త మోటార్లను తెప్పించి బిగించి, గ్రామానికి నిరంతరాయంగా నీటి సరఫరా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రూ. 90 లక్షలతో సీసీ రోడ్లు.. కార్యకర్తలకు అండగా రామేశ్వర్ అన్నగతంలో ఏ నాయకుడూ చేయని విధంగా, సర్పంచ్ రామేశ్వర్ తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిలిచారు. సుమారు రూ. 90 లక్షల నిధులతో గ్రామంలో ఇంటర్నల్ సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అప్పగించి, వారికి ఉపాధి కల్పించారు. "గతంలో గెలిచిన నాయకులు కార్యకర్తలను పట్టించుకోలేదు.. కానీ రామేశ్వర్ అన్న తనపై నమ్మకంతో ఉన్న కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని పనులు ఇప్పించారు" అని స్థానిక నేతలు కొనియాడారు.

భద్రత పరంగా కూడా మర్పల్లిని ముందంజలో ఉంచుతూ, తాను గెలిచిన తర్వాత గ్రామ పరిధిలోని ప్రతి ముఖ్యమైన సెంటర్లలో (మెయిన్ కూడళ్లలో) సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ప్రజలతో ముఖాముఖిగా వివరించారు. స్పీకర్ ప్రసాద్ అన్న ఆశీస్సులతో మరిన్ని నిధులు రాబట్టి, మర్పల్లిని నియోజకవర్గంలోనే ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన మాట ఇచ్చారు.

హాజరైన ముఖ్య నాయకులు:

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ అంతుగారీ మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు సుభాష్ యాదవ్, ఉప్పరి నగేష్, దివాకర్, మాజీ సర్పంచ్ పందు నాయక్, సలీం, మహమ్మద్ గౌసో దీన్, నర్సింలు యాదవ్, శేఖర్ యాదవ్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

?? ఈ ప్రోగ్రాం చూసి ప్రజలు (జనాలు)ఏమనుకుంటున్నారంటే... (ప్రజాభిప్రాయం)

సర్పంచ్ మదుగు రామేశ్వర్ నేరుగా తమ వాడల్లోకి రావడంపై గ్రామస్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జనాలు అనుకుంటున్న మాటలు మాటల్లో చెప్పాలంటేఇలాంటి నాయకుడిని చూడలేదు గంటలో ఓట్లు వేయించుకుని వెళ్లిన నాయకులు మళ్లీ ఇటువైపు చూడలేదు. కానీ రామేశ్వర్ అన్న గెలిచినప్పటి నుండి ఊరి గురించే ఆలోచిస్తున్నాడు. అధికారుల నిధుల కోసం ఆగకుండా, సొంత జేబులో నుండి డబ్బులు పెట్టి నీళ్ల మోటార్లు వేయించడం ఆయన పెద్ద మనసుకు నిదర్శనం."

"కార్యకర్తలను గౌరవించిన నిజమైన లీడర్రాజకీయాల్లో నాయకుల కోసం తిరిగే కార్యకర్తలకు పనులు ఇచ్చి ఆదుకున్న ఏకైక సర్పంచ్ రామేశ్వర్ అన్నే. 90 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులను కార్యకర్తలకు ఇచ్చి, వారి కుటుంబాలకు ఉపాధి చూపించారు. ఆయనను నమ్ముకుంటే అండగా ఉంటారనే నమ్మకం అందరిలో పెరిగింది."

"వర్షాకాలం వేళ పెద్ద దిక్కులా ధైర్యం చెప్పారుపాత ఇళ్లలో ఉండొద్దని చెప్పడమే కాకుండా.. వాటిని కూల్చేసి స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్న సాయంతో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని చెప్పడం మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. సీసీ కెమెరాల వల్ల ఊరికి భద్రత పెరిగింది. మర్పల్లిని ఆదర్శ గ్రామంగా మారుస్తానన్న ఆయన మాటలు త్వరలోనే నిజమవుతాయి."

## ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
## డి సి హెచ్ ఎస్ డాక్టర్ కవిత



**జహీరాబాద్, జూన్ 17 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డి సి హెచ్ ఎస్ డాక్టర్ కవిత సూచించారు. జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రిని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పర్యటించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు మజ్జిగ సుజిత విశ్వేశ్వర్, నామ స్రవంతి రవి కిరణ్ వారిని కలిసి ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ కవిత తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అప్రజస్వామీకం
## - ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్





**జహీరాబాద్, జూన్ 17 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామికమణి ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందోల్ నియోజకవర్గం లో మంత్రి దామోదర బి ఆర్ ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆందోల్ నియోజకవర్గం లో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మంత్రి దామోదర్ ను ప్రశ్నిస్తూ పోస్ట్ చేసినందుకు కిడ్నాప్ తరహాలో అరెస్టు చేయడమేంటన్నారు. జహీరాబాద్ పోలీస్ స్టేషన్లో అశోక్ పరామర్శించారు. అందోల్ నియోజకవర్గం లో మంత్రి చేసిన అభివృద్ధి ఏమి లేదని, బి ఆర్ ఎస్ హయాంలో చేసిన పనిలే కనిపిస్తున్నాయన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నారాయణ, చేవెళ్ల విట్టల్, తదితర నాయకులు ఉన్నారు.

## టీ.వై.జె.ఎఫ్,యూనియన్ అందోల్ నియోజకవర్గశీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ.వై.జె.ఎఫ్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గశీ నూతనకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,నూతనకమిటీలో జోగ్యల్ల రాజు అధ్యక్షుడిగా, జెల్ల భాగయ్య ప్రధాన కార్యదర్శిగా, మాదిగ బుచ్చయ్య,ఉపాధ్యక్షుడిగా, మదారి నాగరాజు, కోశాధికారిగా, డాకూరి సుకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.ఈసందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్నిని లబెట్టుకుంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, టీ.వై.జె.ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సారీ వేడుకలకు హాజరైన ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన చిటమట రఘు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 17** ములుగు బిమంత్రి సీతక్క పి.ఏ భాస్కర్ కుమార్తె సారీ ఫంక్షన్ మరియు వారి కుమారుడు ధోతి కట్టుట వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ శుభకార్యానికి జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు హాజరై కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు...బి

ఈ సందర్భంగా చిన్నారికి ఆశీర్వాదాలు అందజేస్తూ, ఆమె భవిష్యత్తు ఆనందంగా, విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. భాస్కర్ గారి కుటుంబానికి శుభాభినందనలు తెలియజేసిన రఘు గారు, ఇలాంటి ఆనంద క్షణాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు...ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబెర్ వసంత శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్ కుమార్, వార్డ్ మెంబర్ ఉమ్మనేని రమేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సహాయం

హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వర్కింగ్ జర్నలిస్టులకు మెడికల్ స్కీం వర్తించేలా ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అబిడ్స్ చాపెల్ రోడ్డులోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో ఇటీవల మరణించిన , ప్రమాదాలకు గురైన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సహాయం మరియ పెన్షన్ చెక్కులను శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ అండగా నిలిచేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు.

నిత్యం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని , పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తుందని ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## నూతన మల్కాజిగిరి కమిషనర్ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించిన డీజీపీ

హైదరాబాద్, పోలీసు సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం మరియు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తో కలిసి ఈరోజు నూతన మల్కాజిగిరి కమిషనర్ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యాలయం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు సమీపంలోని మల్కాజిగిరి జోనల్ కార్యాలయ ప్రాంగణంలో ఉంది. పోలీసు యంత్రాంగానికి, పౌరులకు మధ్య దూరాన్ని తగ్గించడమే ఈ నూతన క్యాంప్ కార్యాలయ ప్రధాన లక్ష్యం. కమిషనరేట్ సేవలను వికేంద్రీకరించడం ద్వారా, ప్రజలు తమ సమస్యల కోసం ప్రధాన కార్యాలయానికి దూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా సులభంగా సేవలు పొందేలా ఈ సౌకర్యం రూపొందించబడింది. నేరేడ్‌మెట్‌లో ఉంది. ఈ సౌకర్యం మల్కాజిగిరి జోన్ మరియు ఉప్పల్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు పరిపాలనా సౌలభ్యాన్ని మరియు సమన్వయాన్ని పెంచుతుంది. ఈ రెండు జోన్లలోని మొత్తం 11 పోలీస్ స్టేషన్లపై నియంత్రణ, పర్యవేక్షణ కోసం ఈ క్యాంప్ కార్యాలయం కేంద్రీకృత హబ్‌గా పనిచేస్తుంది. "ఇది క్షేత్రస్థాయి అధికారులకు, ఉన్నతాధికారులకు మధ్య కీలకమైన అనుసంధానంగా పనిచేస్తుంది. ప్రజల ఫిర్యాదులను మరింత వేగంగా, సున్నితంగా పరిష్కరించేందుకు వీలు కల్పిస్తుంది" అని ప్రారంభోత్సవంలో డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి , కలెక్టర్ ఓ డీఎం టి. వినయ్ కృష్ణా రెడ్డి , హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ , అడ్మిన్ డీసీపీ, మల్కాజిగిరి జోన్, ట్రాఫిక్ మల్కాజిగిరి డీసీపీ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం

## గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలి

## మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 17**
ములుగుబుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఐటీ రంగం ప్రధానంగా నగరాలకు మాత్రమే పరిమితమైందని, ఐటీ అవకాశాలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు కూడా చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అన్నీ ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరిగితేనే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

శ్రియా ఇన్ఫోటెక్ సంస్థ గత ఒక సంవత్సరం కాలంగా ములుగు ప్రాంత యువతకు వివిధ రంగాల్లో సాంకేతిక శిక్షణ అందిస్తూ, యాప్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక నైపుణ్యాలను నేర్పిస్తూ ముందుకు సాగుతోందన్నారు.

స్థానిక అవసరాలకు అనుగుణంగా యాప్‌లను అభివృద్ధి చేసి వివిధ పాఠశాలలు, సంస్థలు, ఐటీ రంగానికి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 15 మంది యువత ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు.

హైదరాబాద్ వంటి నగరాలకు మాత్రమే ఐటీ పరిశ్రమలు పరిమితం కాకూడదని, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ రంగం విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి సాంకేతిక యుగంలో ఎక్కడి నుంచైనా పని చేసే అవకాశాలు ఉన్నాయని, అభివృద్ధి, ఉద్యోగాల వికేంద్రీకరణ ద్వారానే సమాజంలో సమాన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ములుగు జిల్లాలో ఇతర ఐటీ సంస్థలు, కంపెనీలు స్థాపించడానికి ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు.

శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్ రంగారి తీసుకున్న ఈ ముందడుగు అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో సంస్థ మరింత విస్తరించి మరెందరో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే బలమైన పునాది

## పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

## :: రాష్ట్ర పంచాయతీరాజ్, మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ప్రజా బలం ప్రతినిధి ములుగు జిల్లా జూన్ 17 ములుగు** బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని జీవంతరావుపల్లిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సి.ఆర్.ఆర్ 2025-26 నిధులు రూ.29.50 లక్షలతో పి.ఆర్ రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు చేపట్టనున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి శంకుస్థాపన చేసి, "ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య -- ప్రతి చేతిలో ఉచిత పాఠ్యపుస్తకాలు" అనే లక్ష్యంతో జీవంతరావుపల్లి పి.ఎం శ్రీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు.



జీవితంలో లోపాలను, కష్టాలను చూసి నిరుత్సాహపడకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, అవసరమైన సకల సౌకర్యాలు, మెరుగైన వసతి కల్పిస్తూ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి అందరిలో ఉత్తమంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవితాన్ని తీర్చిదిద్దే శక్తిగా భావించి సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీఈఓ సిద్ధార్థ్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి కల్పనతో ఆర్థిక స్వావలంబన సాధ్యం

## గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 17**
ములుగు నాణ్యమైన ఉత్పత్తులతో మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలి
:: రాష్ట్ర పంచాయతీరాజ్, మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం ములుగులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మదర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించనున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మహిళలు ఇంటి వద్ద నుంచే చేయగలిగే టైలరింగ్, కుట్టు మిషన్, చిన్న స్థాయి ఉత్పత్తి యూనిట్లు వంటి ఉపాధి మార్గాలు గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ వనరులుగా మారతాయని తెలిపారు. ఉపాధి కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే కుటుంబ అవసరాలు తీర్చుకుంటూ ఆదాయం పొందే అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.అదేవిధంగా అటవీ ప్రాంతాల్లో లభించే విస్తారాకులు, తేనె, ఇప్పపూల వంటి సహజ వనరులను మహిళా సంఘాల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్లే విధంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఉత్పత్తుల విషయంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యతను కాపాడుకుంటే వినియోగదారుల విశ్వాసం పెరిగి మార్కెట్‌లో మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.ములుగు జిల్లా పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రాబోయే పుష్కరాలు, మేడారం, బొగత జలపాతం, రామప్ప, లక్నవరం వంటి ప్రాంతాలకు వచ్చే సందర్శకులను దృష్టిలో పెట్టుకుని మహిళా సంఘాలు ఇప్పటి నుంచే స్థానిక ఉత్పత్తుల తయారీ, విక్రయాలపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. గ్రామీణ మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మదర్ ఫౌండేషన్ ప్రతినిధులు, డిఆర్డిఏ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ రెయిన్బో హాస్పిటల్లో భారీ అగ్ని ప్రమాదం

విజయవాడ నగరంలోని రెయిన్ బో ఆసుపత్రిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. చిన్నపిల్లల ఎమర్జెన్సీ వార్డులో అగ్నిప్రమాదం జరగడంతో పేషంట్లు . ఒక్కసారిగా షాక్కు గురైయారు. ఫైర్ సిబ్బంది ఆసుపత్రి వద్దకు చేరుకుని మంటలను అదుపు చేసారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది

# యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## ఉద్యోగం సాధించిన యువత కుటుంబానికి ఆర్థిక బలాన్ని చేకూర్చాలి

## ::మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 17 ములుగు** బుధవారం ములుగు జిల్లా ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళా--2026 కార్యక్రమానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.

ఉద్యోగం చేయాలనే సంకల్పంతో యువత నిరంతరం కృషి చేయాలని, వచ్చిన అవకాశాలను వదులుకొని సమయాన్ని వృథా చేస్తూ మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకోకుండా గౌరవప్రదమైన జీవనాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. మేధో సంపత్తి పెంపొందించుకునేందుకు నిరంతరం శ్రమించాలని, జీవితంలో ఉన్నత ఆశయాలను సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతకు ప్రత్యేకంగా వసతి గృహాలు ఏర్పాటు చేసి గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందించే ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని అన్నారు. ములుగు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత ఆర్థికంగా బలోపేతం కావాలని, ఉద్యోగ ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటంతో పాటు జిల్లా అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.

ఉద్యోగం రాని వారు నిరుత్సాహపడవద్దని, వారికి మళ్లీ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. యువత ఇంటి వద్ద తల్లిదండ్రులకు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాకెట్‌లా దూసుకుపోవాలని సూచించారు. ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం కావాలని, త్వరలో రాబోయే పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం జిల్లా యువతీ యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాకు సుమారు రెండు వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. జాబ్ మేళాలో ఉద్యోగం సాధించిన వారు శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా పూర్తి చేసి అద్భుతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రాంతీయ తారతమ్యం లేకుండా ఉద్యోగం వచ్చిన ప్రాంతానికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. భవిష్యత్తులో నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ, యువత తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. సమాజాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని బాధ్యతాయుత పౌరులుగా సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.

ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోసం ఉచిత వసతితో కూడిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం జరుగుతోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఏఎస్పీ మనన్ భట్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ శతాబ్ది వేడుకలు




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 17**మన భారత దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి ప్రతిపాదన వలన డిసెంబర్ 2014 సంవత్సరంలో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం గా యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఆమోదించడం జరిగింది.

2015 సంవత్సరం నుండి జూన్ 21 ను ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది.

. భారతదేశంలో ఆయుష్ మినిస్ట్రీ తరపున అన్ని రాష్ట్రాలలో జిల్లా మండల గ్రామ పరిధిలో యోగా దినోత్సవం వేడుకలు పెద్ద ఎత్తున జరుపబడుతున్నాయి. 2015 నుండి 2026 వరకు ప్రజల్లో యోగా ప్రాముఖ్యత గూర్చి అవగాహన పెరిగింది.

. యోగా అనేది భారతదేశంలోని మన యోగులు ఋషులు కనిపెట్టిన ఒక గొప్ప సంజీవని ప్రాచీనమైన అభ్యాసం యోగ ప్రతిరోజు చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళనలు తగ్గించబడతాయి. శారీరిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

దీర్ఘకాలిక వ్యాధులు, కండరాల కీళ్ల నొప్పులు, ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలు,బరువు తగ్గడం జ్ఞాపకశక్తి మెరుగు పడుతుంది.

యోగ అభ్యసనానికి వయోపరిమితి లేదు, పసిపిల్లల నుండి వయవృద్ధుల వరకు ఎవరైనా దీనిని సుశిక్షితులైన గురువుల సమక్షంలో నేర్చుకుని సురక్షితంగా చేయవచ్చు.

ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ హోమియో డిస్పెన్సరీ ఎటురూ నాగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో ఈరోజు యోగావాకులో భాగంగా యోగ చైతన్యం గురించి యోగా మాస్టర్ రామకృష్ణ వివరించడం జరిగింది. ప్రతిరోజు ఉచితంగా యోగా నేర్పించడం జరుగుతుంది కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని వివరించారు.

## 170 యాక్ట్ అని చెప్పి భూ కబ్జాలకు పాలపడుతున్న వారిని తరిమి కొడతానన్న గిరిజనులు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 17**ఏటూరు నాగారం మండల కేంద్రంలో వారం రోజులుగా జరుగుతున్న గిరిజనేతర భూములను గిరిజనుల మని చెప్పి 170 యాక్ట కింద ఉన్న భూములని గిరిజనేతరులు సాగు చేసుకునే జీవనం గడుపుతున్న భూములను ఎస్టీ పేరు చెప్పి భూ కబ్జాలు చేస్తూ భూములు లాక్కుంటున్నా వారిపై తిరగబడిన స్థానిక గిరిజనులు ఏక్కడి నుండో బ్రతకడానికి వచ్చి గిరిజనేతరులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని చట్ట ప్రకారం శిక్షించాలని స్థానిక గిరిజనులు అధికారులను కోరారు

ఎటూరు నాగారంలో బీసీ వాళ్లు మేము అన్నదమ్ములు అక్క చెల్లెలు లాగా కలిసి ఉన్నాము అని ఏప్పుడు ఇలాంటి సమస్యలు మాకు రాలేదని దీనంతటికీ కారణం కొంతమంది గ్రూప్ గా తయారై గిరిజనేతరులు సాగు చేసుకునే భూములను ఆసరాగా చేసుకుని గుడిసెలు వేసుకుని వాటిని కబ్జా చేస్తున్నారని

అన్నారు వారికి మాకు ఏలాంటి సంబంధం లేదని ఏటూరునాగారం స్థానికంగా ఉండబడే గిరిజనలు తేల్చి చెప్పారు అధికారులు ఐ టి డి ఏ పిఓ స్థానిక ఎస్పీ వారిపై చర్యలు తీసుకొని చట్ట ప్రకారం శిక్షించాలని అధికారులను కోరారు

## జిల్లా (ఆత్మ) చైర్మన్ గా చిటమట రఘు నియామకం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 17**

ఎమ్మెల్యే క్వార్టర్ బిమంత్రి సీతక్క ను మర్యాదపూర్వకంగా కలిసిన చిటమట రఘు శాలువాతో సన్మానించిన మంత్రి సీతక్క బిసహకరించిన జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు చిటమట రఘు కృతజ్ఞతలు.

బిజిల్లా ఆత్మ చైర్మన్ గా నియమితులైన చిటమట రఘు మర్యాదపూర్వకంగా మంత్రి సీతక్క గారిని కలిసి కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క చిటమట రఘు గారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.బినాపై నమ్మకంతో జిల్లా ఆత్మ చైర్మన్‌గా నియమించి నందుకు మంత్రి సీతక్క గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రఘు తన నియామకానికి సహకరించిన ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారికి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ గారికి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, బ్లాక్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ గారికి అలాగే జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు

## సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న కన్నయ్య గూడెం ఎస్సై ఇ వెంకటేష్



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 14** కన్నయ్య గూడెం మండలం నుంచి ఈరోజు ములుగులో ఏర్పాటుచేసిన జాబ్ వేలకు హాజరైన కన్నయ్యగూడెం యువతి యువకులు స్థానిక ఎస్సైఇ వెంకటేష్ సౌరద్యంలో 20 మంది యువతీ యువకులను ఉద్యోగాల కోసం ములుగులో నిర్వహించిన జాబ్ వేలకు హాజరుకాక అందులో నుంచి 12 మంది యువతీ యువకులకు ఉద్యోగ పత్రాలను అందజేశారు దీనితో స్థానిక ఎస్సై గారికి సంతోషానికి హద్దులు లేవు నా వంతు కన్నయగూడెం నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు

# రెండో రోజుకే బ్రేక్ ఫాస్ట్ బంద్

### బ్రేక్ ఫాస్ట్ పథకం మొదలుపెట్టిన ప్రభుత్వం.. రెండో రోజుకే చేతులెత్తేసిన వైనం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :విద్యార్థులకు పూరీలు పెడుతున్నామని గట్టిగా ఉన్న అప్పడాలు, వడ్డించిన సిబ్బంది,మెనూ ప్రకారం పాలు,రాగి జావ, మిల్లెట్, ఇడ్లీ, సాంబార్ ఇస్తారని ఆశించిన విద్యార్థులు, బ్రేక్ ఫాస్ట్‌కు బదులుగా ఇచ్చిన పూరీలు తినలేక అర్ధాకలితో తరగతులకు హాజరైన విద్యార్థులు, బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని సమీక్షించడానికి వెళ్లిన పీపుల్స్ పల్స్ రీసర్చ్ సంస్థ ప్రతినిధులు,రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన అప్పడాలను చూసి షాక్

పరిమిత స్కూళ్లు,కాలేజీల్లో నామ్ కే వాస్తేగా బ్రేక్ ఫాస్ట్ పథకం మొదలుపెట్టిన ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు కావట్లేదని గుర్తించిన పీపుల్స్ పల్స్, రెండో రోజుకే పథకం ఆగిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు..

# వర్షాకాలం... విద్యుత్తుతో జాగ్రత్త

### అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలకే ముప్పు
### అత్యవసర సేవలకు అధికారులకు సమాచారం అందించాలి
### జోగిపేట డివిజన్ ట్రాన్స్ కో డి ఈ జి,శ్రీనివాసులు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** వర్షాకాలం మొదలైంది, భారీ వర్షాలు ఈదురుగాలులతో విద్యుత్ వ్యవస్థకు గండం పొంచి ఉందని, విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు, బలమైన గాలులకు చెట్ల కొమ్ములు విద్యుత్ తీగలపై పైడి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జోగిపేట ట్రాన్స్ కో డివిజన్ డిఈ ఇంజనీర్ జి,శ్రీనివాసులు, ప్రజలకు సూచించారు, కరెంట్ విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాల మీదికి తెస్తుందని ఆయన హెచ్చరించారు, వానాకాలం వస్తున్నందున, విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన తెలిపారు, కరెంట్ విషయంలో ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, తడిచేతులతో ఎక్కడ విద్యుత్ వైర్లు, ఇతర వాటిని తాక కూడదన్నారు, తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, స్విచ్ బోర్డులను అసలు తాగొద్దన్నారు, వేలాడుతున్న తీగలను గమనిస్తే, వెంటనే అధికారులకు సమాచారం అందించండి, బట్టలు ఆరేసే జిఐ దండాలకు బదులు, ప్లాస్టిక్ దండాలనే వాడండి, ఇంటి రేకులు మెటల్ షీట్లకు కరెంటు వైర్ తగలకుండా చూసుకోండి, ఇనుప కూలర్లు ఆన్లో ఉండగా, నీళ్లు పోయకండి, మోటార్లు, పైపులు స్టార్టర్లకు, సరైన ఎర్తింగ్ తప్పనిసరి, తడిచేతులతో విద్యుత్ పరికరాలను తాకవద్దని, విద్యుత్ తీగల తో చేపలు పట్టడం, పంట పొలాల్లో విద్యుత్ పెన్సింగ్ పెట్టడం, చట్టరీత్య నేరమని ఆయన తెలిపారు...


జోగిపేట డివిజన్ ట్రాన్స్ కో డీఈ శ్రీనివాసులు

## మర్పల్లి నూతన బాధ్యతలు తీసుకున్న ఎమ్మార్వో, సన్మానించినకాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అండ్ సర్పంచులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 17 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నూతనంగా మర్పల్లి ఎమ్మార్వో గా బాధ్యతలు తీసుకున్న మనోహర్ చక్రవర్తిని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, పట్లూర్ సర్పంచ్ పరశురాం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగిందని తెలిపారు మర్పల్లి నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎమ్మార్వో మనోహర్ చక్రవర్తి మండల ప్రజలకు ప్రజలకు నాయకులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ విధి నిర్వహణలో ప్రజలకు నా వంతు సహాయ సహకారాలు సేవలు ప్రజలకు అందిస్తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటాను అని తెలిపారు కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, పట్లూర్ సర్పంచ్ పరశురాం, మల్లికార్జునగిరి సర్పంచ్ మరియు వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు ప్రజలు నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎమ్మార్వో ని సన్మానించడం జరిగిందని తెలిపారు



## ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి -ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, జూన్ 17 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గంలో గుంతలు పడిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. బుధవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి జహీరాబాద్ బీదర్ రహదారి పై గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ రోడ్ల దుస్థితి పై గతంలో అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందని ,సంబంధిత అధికారులకు, మంత్రులకు తెలిపిన చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా న్యాల్కల్ మండలం ఖలీల్ పూర్ సమీపంలో మూడు రోజుల క్రితం బైక్పై వెళ్తూ రోడ్డు గుంతలు గా ఉండడంతో తప్పించబోయి కింద పడడంతో అతనిపైనుండి లారీ దూసుకెళ్లి మరణించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్లో మాట్లాడి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు





రాష్ట్రంలో రెవెన్యూ పడిపోతా ఉంది, కానీ రెవెన్యూ మంత్రి అవినీతి సామ్రాజ్యం వందల వేల రెట్లు పెరిగిపోయింది.

రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది కానీ రాష్ట్ర ఆర్థిక మంత్రి డిప్యూటీ సీఎం భట్టి గారి ఆదాయం, కమీషన్ దందాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.

బాంబుల మంత్రి పొంగులేటి ఎంత సంపాదించాడంటే.. నోట్లు లెక్కపెట్టే మెషీన్లు కూడా అలసిపోతున్నాయి.

రెండు సంవత్సరాల కింద ఈడీ దాడి చేసి పట్టుకున్న వందల కోట్ల రూపాయల పైన కనీసం ప్రకటన లేదు.

పొంగులేటి ఈడీ దాడి పైన బీజేపీ కానీ కాంగ్రెస్ కానీ ఎందుకు మాట్లాడలేదు ఇన్ని రోజులు.

బీజేపీతో పొంగులేటికి ఉన్న లాలూచీ కారణంగానే ఈడీ ఆయన పైన కేసు పెట్టలేదు.

తెలంగాణలో కోటి ఎకరాలు తెలంగాణ రాష్ట్రంలో వివాదాస్పద జాబితాలో పెట్టి వాటిని దోచుకుంటున్నాడు.

కోటి ఎకరాల పైన ఆంక్షలు పెట్టి ఆ భూములను బెదిరించి సెటిల్‌మెంట్లు చేయించుకుంటూ నికృష్టమైన పనులు చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి దొంగ అయితే పొంగులేటి గజదొంగ మాదిరిగా దోచుకుంటున్నాడు. పొంగులేటి డైలాగులు, అహంకారం ప్రజలందరూ చూశారు.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీసీ మంత్రులు కొండా సురేఖ గారిని మాట్లాడనియ్యకుండా మైక్ కట్ చేశారు. పక్కన ఉన్న మరో బీసీ మంత్రి వాకిటి శ్రీహరి మీద కాగితాలు విసిరేశారు. ఎంత అహంకారం కాకుంటే తోటి మంత్రులతో అంత అహంకారంగా ప్రవర్తిస్తాడు.

బీసీ మంత్రులు కూడా పొంగులేటి మాదిరే ప్రజలతో ఎన్నుకోబడ్డ వారని గుర్తుంచుకోవాలి.

అధికారులను పట్టుకొని సెన్సు ఉందా అని అహంకారంతో పొంగులేటి మాట్లాడుతున్నాడు.

ఇష్టానుసారంగా దోచుకోవడానికి, అక్రమ మైనింగ్ చేయడానికి నీ కుమారుడిని అడ్డు పెట్టుకొని వట్టినాగులపల్లిలో గజదొంగల భూములు దోచుకోవడానికి నీకు సెన్స్ ఉందా అని అడుగుతున్నా.

వట్టినాగులపల్లిలో పదుల ఎకరాలపైన మీ కొడుకు మరియు కిరాయి మూకలు పంపి వాళ్లపై దాడి చేసింది వాస్తవం కాదా?

నీ కొడుకుపైన పోలీస్ కేసు నమోదు చేస్తే ట్రాన్స్‌ఫర్ చేసింది వాస్తవం కాదా? నీ అన్యాయాలు, అక్రమాలు అహంకారం ప్రజలు చూడట్లేదు అనుకుంటున్నావా?

అందుకే పాలేరులో ఎప్పుడు ఎన్నిక వచ్చినా గులాబీ జెండా మాత్రమే ఎగురుతుంది.

హౌసింగ్ మంత్రిగా 20 లక్షల ఇండ్లు కడితేనే ఓట్లు అడుగుతా అన్నావు కదా ఆ మాట మీద నిలబడే సత్తా ఉన్నదా?

మరి సగం కాలం అయిపోయింది 10 లక్షల ఇండ్లు కట్టావా? లేదా నువ్వు కడతా అన్న 20 లక్షల ఇండ్లు నీ రాఘవ కంపెనీ ఏమైనా కడుతుందా?

ఖమ్మంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు ఎన్ని ఇండ్లు ఇచ్చావు?

వారికి 6 లక్షల రూపాయలు ఇండ్లు కట్టుకోవడానికి ఇస్తామన్నావు ఆ మాట ఎక్కడ పోయింది.

అయినా నీకు ఇల్లు కట్టే తెలివి ఎక్కడిది, వెలుగుమట్ల మాదిరి ఇండ్లు కూలగొట్టడం, విధ్వంసం తప్ప వికాసం తెల్వదు.

విధ్వంసం తప్ప వికాసం తెలవని దండుపాళ్యం ముఠా మీది. కాంగ్రెస్ రైతుల నుంచి పీల్చి పిండుకున్న భూమి శిస్తు కేసీఆర్ తీసేసిండు.

కానీ కాంగ్రెస్ పార్టీ మళ్ళీ భూమి శిస్తు పెట్టి రైతులను వేధించేందుకు సిద్ధమవుతున్నది.



రేవంత్ రెడ్డి మరియు రెవెన్యూ మంత్రి పొంగులేటి భూమి శిస్తు పెడతామని చెబుతున్నారు. భూమి శిస్తు పేరుతో రైతుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తారా?

ములుగు జిల్లాలో పొంగులేటి వేల కోట్ల ఇసుక దందా కోసం స్కెచ్ వేశాడు, చివరికి సమ్మక్క సారలమ్మ జాతర్ల టెండర్లను కూడా పొంగులేటి వదిలిపెట్టలేదు. సమ్మక్క సారలమ్మ జాతరలో కూడా కమీషన్ల కుమ్ములాటల కోసం మంత్రులు కొట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతామధు, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లింగాల కమల్ రాజ్, ఏనుగుల రాకేశ్ రెడ్డి, బమ్మెర రామ్మూర్తి మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# షాదీ ఖానా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం : నగర మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 17, ప్రజాబలం** :రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సహకారంతో షాదీ ఖానా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హామీ ఇచ్చారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ గా ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఎన్నికైన తరువాత ముస్లిం మైనారిటీల ప్రయోజనార్థం చేపట్టిన పనులను వారికి వివరించారు. మైనారిటీల సంక్షేమం కోసం ఇంకా చేపట్టవలసియున్న పనులను దృష్టికి తీసుకు రావాలని కోరారు. పార్టీలు , మతాలకు అతీతంగా రామగుండం నగర మంతా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయనే విషయం గమనించాలని కోరారు. రెండేళ్ల చిరు కాలంలోనే వెయ్యి కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టి రామగుండం నగరంలో గణనీయమైన మార్పు తీసుకువచ్చిన ఎంఎల్ఏ కి అండగా నిలిచి ప్రోత్సహించాలని కోరారు.

# జూన్ 20న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ డబ్బులు..



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 17 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** దేశవ్యాప్తంగా ఉన్నఅన్నదాతలకుకేంద్రప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది,పీఎం కిసాన్ 23వ విడత నిధులను జూన్ 20న, (శనివారం) విడుదల చేయబోతున్నట్లుప్రకటించింది,ఈ స్కీమ్ కింద కేంద్రం ఏడాదికి రూ.2 వేల చొప్పున 3 విడతల్లో మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది,23వ విడత ద్వారా 9,కోట్లకు పైగా రైతులకు లబ్ధి కలగనుంది,కాగా ఈ-కేవైసీ చేసుకున్న రైతులకే డబ్బులు అందుతాయని అధికారులు స్పష్టం చేశారు....

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేస్తే జరిమానా : నగర్ మేయర్ మహంకాళి స్వామి



**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 17, ప్రజాబలం:** బహిరంగ ప్రదేశాలలో చెత్త పడవేస్తే రేపటి నుండి జరిమానా విధిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా బుధవారం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి 46 వ డివిజన్ ఇందిరా నగర్ లో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు , కాలువల్లో చెత్త పడవేసే వారి ఫోటోలు తీసి చెత్త పరిమాణానికి అనుగుణంగా జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. వర్షా కాలంలో వరద ముంచెత్తకుండా ఎం ఎల్ ఎ ఆదేశాల మేరకు గత మూడు నెలలుగా ప్రదాన కాలువల్లో పూడిక తొలగిస్తున్నామని అన్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ నుండి వచ్చేనీటితో వర్షాకాలంలో నీళ్ళు ఇందిరా నగర్ లోని ఇళ్ళల్లోకి వస్తున్న నేపథ్యంలో నివారణా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు సహకరించి రోడ్లు ,కాలువలఅబ ఆక్రమించి నిర్మించిన కట్టడాలు స్వచ్ఛందంగా తొలగించాలని అన్నారు. ప్రతి వీధిలో చివరి ఇంటి వరకు అన్ని మౌళిక వసతులు కల్పించడంతో పాటు అత్యవసర



పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చేలా వీదులు విశాలంగా ఉంచాలని ఎం ఎల్ ఎ జారీ చేసిన ఆదేశాల మేరకు చెట్ల కొమ్మలు , పొదలు తొలగిస్తున్నామని అన్నారు. త్వరలోనే ఇందిరా నగర్ లో యు జి డి , రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు నాడుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కాగా ఈ సందర్భంగా స్థానిక ఉన్న ఒక మధ్యశీ దుకాణం ఎదుట రోడ్డు పై నిర్మించిన ఆక్రమణ తొలగించారు. ఖాళీ సీసాలను కాలువలో పడవేసిన సదరు దుకాణ యజమానికి భారీ జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు దాసరి సాంబ మూర్తి , చిదురాల నాగ రాజు, వడ్లూరి రవి , పాటు టి పి ఎస్ నవీన్ , ఎ . ఇ , మనోజ్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్, మెప్మా సి ఓ ఊర్మిళ , టి పి బి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com